ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 సంపుటి: 1 సంచిక: 79 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

**ఏ దేశం ఇరాన్‌కు సహాయం చేయకూడదు**

**ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం**

**మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు**

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు.

- న్యూఢిల్లీ, (సింగిడి)



2



2

## 5 కోట్లకు రేప్ కేసులు సెటిల్

**పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు**

**ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ**

# మారుతున్న 'కర్తవ్యం'.. జారిపోతున్న ఆశయం

## ఎన్నో కలలతో యూనిఫాం | ఒత్తిళ్లతో మెత్తబడుతున్న 'పోలీస్'

### ఉత్తమ శిక్షణ కూడా ఫలితం ఇవ్వడం లేదా..?

### ఖద్దరు క్రీ(నీ)డలో ఖాకీలు -1

**పోలీస్ ట్రైనింగ్ పూర్తి చేసి తొలిసారి ఖాకీ డ్రెస్ వేసుకున్న రోజు... ఆ యువకుడి గుండె గర్వంతో ఉప్పొంగుతుంది. కుటుంబం మొత్తం ఆనందిస్తుంది. బంధువులు అభినందిస్తారు. "మనోడు పోలీసయ్యాడు" అని ఊరంతా గర్వపడుతుంది. కానీ కొంతకాలం గడిచాక... అదే ఖాకీ వెనుక... అసలేం జరుగుతోంది.**

(మోహన్ పూసాల)



**"పోలీస్..."**

ఈ పదం వినగానే గుండెల్లో గర్వం పొంగుతుంది.ఖాకీ దుస్తులు కనిపిస్తే గౌరవం కలుగుతుంది.భుజంపై ఉన్న నక్షత్రాలు చూస్తే ఒక ప్రత్యేకమైన భరోసా కనిపిస్తుంది.చేతిలో లాఠీ కాదు.., చట్టం తమతో ఉందనే ధైర్యం సామాన్యులలో కనిపిస్తుంది.ఎంతోమంది యువతకు పోలీస్ ఉద్యోగం అంటే కేవలం ఒక ప్రభుత్వ ఉద్యోగం కాదు.

ఒక కల... ఒక ఆశయం.... ఒక బాధ్యత.

**"నేను పోలీస్ అవుతాను..."**

అని తల్లిదండ్రులతో చెప్పినప్పుడు ఆ యువకుడి కళ్లలో కనిపించేది ఉద్యోగం సంపాదించాలనే కోరిక మాత్రమే కాదు.సమాజానికి సేవ చేయాలనే తపన.అన్యాయం జరిగితే అడ్డుకోవాలి.బలహీనుడికి అండగా నిలవాలి.తప్పు చేసినవాడిని చట్టం ముందు నిలబెట్టాలి.

ఎవరైనా సరే... ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా సరే... చట్టం ముందు అందరూ సమానమే అని నిరూపించాలి. ఇదే ఆశయంతో ఎంతోమంది యువత పోలీస్ యూనిఫాం ధరిస్తున్నారు.

కానీ... ఉద్యోగంలోకి వచ్చిన తర్వాత ఆ కలల ఖాకీకి అదే యూనిఫాం క్రమంగా భారమవుతున్నదన్న వాదన వినిపిస్తోంది. పైవారి మాట వింటేనే డ్యూటీ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదన్న ఆరోపణ కూడా ఎక్కువగానే వినిపిస్తున్నది. కొన్నేళ్లుగా పోలీసు శాఖపై పెరుగుతున్న రాజకీయ నాయకుల పెత్తనం వల్ల దాదాపు 70 శాతం శాఖ ప్రభావితం అయినట్లుగా తెలుస్తున్నది. కొద్ది మంది ఆఫీసర్లు 'నొప్పివ్వక తానొవ్వక' అన్నట్లుగా డ్యూటీ చేస్తున్నారన్న వాదన ఉంది. ఇక సినిమాలలో చూపించినట్లుగా రూల్స్ ప్రకారం పోయే ఆఫీసర్లు తెర వెనకాలే ఉండి పోవాల్సిన అగత్యం దాపురించిందన్న భావన కూడా లేక పోలేదు.

**ట్రైనింగ్ లో పెర్ఫెక్ట్..!**

పగడ్బందీ శిక్షణ... ఆ శిక్షణలో మానసిక శారీరక తరగతులు, ఏ పరిస్థితుల్లోనైనా గట్టిగా నిలబడగలిగే ఓర్పు, తన విధులలో సమయానుకూలంగా వ్యవహరించగలిగే ధైర్యం.. ఇవన్నీ ఉంటాయి. కానీ నిజ జీవితంలో ఇవేమీ పనిచేయడం లేనట్లుగా చాలామంది ఆఫీసర్లు వాక్యానిస్తున్నారు.

'జర చూసుకుంటూ పోవాలి. ఇవన్నీ ఉంటాయి...' అనే పదం పై నుండి వస్తుండడంతో చాలామంది ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు సైతం లా అండ్ ఆర్డర్ విధులలో మనస్ఫూర్తిగా పనిచేయడం లేనట్లుగా బలమైన వాదన ఉంది.

**సిఐ కాగానే...!**

ఎన్నో బలమైన కాంక్షలతో.. ఎంతో ఆశయంతో ఎస్సెలుగా డ్యూటీకెక్కి మంచి షార్ప్ ఆఫీసర్లుగా పేరు తెచ్చుకున్న వారు సైతం సీఐ ప్రమోషన్ వచ్చిన తర్వాత మెత్తబడి పోతున్నారన్న అభిప్రాయం నెలకొని ఉంది. ఎస్సై స్థాయిలో ఉన్నంత వాడి, వేడి పక్కనపెట్టి కొత్త పెద్దరికం మీదేసుకొని 'చూసుకుంటూ పోవాలి' అనే ధోరణి అలవర్చుకుంటున్నారన్న అపవాదు చాలా మంది ఆఫీసర్ల మీద పడుతున్నది. ఎందుకు అలా అవుతున్నారనేది అందరిని తొలుస్తున్న ప్రశ్న. ఒక రకంగా చెప్పాలంటే రెండు దశాబ్దాలుగా పోలీసు వ్యవస్థ పై రాజకీయ నాయకుల పెత్తనం ఎక్కువైనట్లుగా పలు సంఘాలు సైతం అంగీకరిస్తున్న విషయమే.

**ఈ క్రమంలో...ఖాకీల పై ఖద్దరు పెత్తనం'**

**తరువాతి సంచికలో..!**



## కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం

**లోక్‌భవన్‌కు సీఎం రేవంత్ రెడ్డి... గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ**

**బర్తరఫ్ ఉత్తర్వులపై గవర్నర్ సంతకం... కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ**

*తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వెళ్లారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం, మంత్రులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజాగా నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ముఖ్యంగా కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించే అంశంపై గవర్నర్‌తో సీఎం చర్చించినట్లు సమాచారం.*

- హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సింగిడి)

ఆమె బర్తరఫ్‌కు దారితీసిన పరిస్థితులను రేవంత్ రెడ్డి గవర్నర్‌కు వివరించారు. అనంతరం బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. సీఎం ఎదురుగానే గవర్నర్ బర్తరఫ్ ఉత్తర్వులపై సంతకం చేసినట్లు తెలిసింది. దీంతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ లోక్‌భవన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కొండా సురేఖ బర్తరఫ్‌తో తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ అయ్యాయి. ఈ ఖాళీలను ఎవరితో భర్తీ చేయాలన్న అంశంపైనే తాజా భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా కొండా సురేఖ స్థానంలో ఎవరిని తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందనే ప్రచారం జరిగింది. మరోవైపు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఈ ఇద్దరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనే చర్చ మొదలైంది. లేకపోతే కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకొస్తారా అన్నది కూడా ఆసక్తిగా మారింది.

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

**సురేఖ, చిన్నా రెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్**

- ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
- బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

2



## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్ తక్కువేమీ కాదు: సీఎం

**ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్**

**ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి**

**అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం**

**పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ**

2

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు.

- హైదరాబాద్ (సింగిడి)

## నిజం దాచేందుకే బర్తరఫ్ ?

**సుస్మిత వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం... సీఎం, కుటుంబంపై తీవ్ర ఆరోపణలు**

**రూ.200 కోట్ల భూమి వ్యవహారంపై ప్రశ్నలు... కొండా సురేఖపై వరుసగా చర్యలు.. బర్తరఫ్‌తో తెరపైకి అసలు చర్చ**



2

**హైదరాబాద్ బ్యూరో - సింగిడి:**

ఒకవైపు కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు.. మరోవైపు కాంగ్రెస్‌లో వరుస పరిణామాలు.. చివరకు తల్లి కొండా సురేఖ మంత్రి పదవిని కోల్పోయారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై సుస్మిత చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. పార్టీ క్రమశిక్షణ కమిటీ జోక్యం.. వివరణలు.. ఆ తర్వాత మంత్రివర్గం నుంచి తొలగించే నిర్ణయం.. ఇలా వ్యవహారం కీలక మలుపులు తిరిగింది. దీంతో సుస్మిత చెప్పిన అంశాల్లో నిజమెంత? వాటికి ఆధారాలున్నాయా? అన్న చర్చ మరింత తీవ్రంగా మారింది.

**సుస్మిత ఆరోపణలేంటి**

ఆగస్టు 19న సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులపై సుస్మిత తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని సీఎం సోదరుడికి కట్టబెట్టారంటూ వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపాయి.



## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

**యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ**

**భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ**

**బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ**

**శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు**

2



## ఈడీ చేతికి వివేకా హత్య కేసు

**దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ**

**కేసులో దస్తగిరి వాంగ్మూలం రికార్డు**

2

## ఇక బస్తా ఎత్తేది మెషినే!

**కూలీల కొరతకు యంత్రాలతో చెక్**

**షాద్‌నగర్ మార్కెట్‌లో ఆధునిక యంత్రాలు**

**పనితీరును పరిశీలించిన ఉన్నతాధికారులు**

2



**షాద్‌నగర్, సెప్టెంబర్ 3 (సింగిడి)**

రాబోయే ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్లలో కూలీల కొరతను అధిగమించడంతో పాటు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకురానుంది.

## అసెంబ్లీకి రండి.. అన్నీ తేల్చుకుందాం!

**కేటీఆర్, హరీష్‌రావులకు మంత్రి అడ్లూరి సవాల్**

**ధర్మపురి సెప్టెంబర్ 03 ( సింగిడి )**

"అభివృద్ధిపై మాట్లాడదామా? అవినీతిపై మాట్లాడదామా? అసెంబ్లీకి రండి.. అన్నీ తేల్చుకుందాం!" అంటూ బీఆర్ఎస్‌పై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నిప్పులు చెరిగారు.



2

## కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన పవన్

**ఎ.కొండూరుకు జేజేఎం-అమరజీవి జలధారలు**

- ఉద్దానం తరహా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ప్రాజెక్టుకు ప్రాణం పోసిన ఉప ముఖ్యమంత్రి
- 26 నెలల కాలంలో రూ. 49.94 కోట్ల పనులు పూర్తి
- 38 ఆవాసాల పరిధిలో 130 కిలోమీటర్ల పైప్‌లైన్
- ఇంటింటికీ కుళాయిలతో దాదాపు 75,000 మందికి స్వచ్ఛమైన తాగునీరు

2




## సీఆర్డీఏ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

**పొగాకు, పౌల్ట్రీ రైతులకు ఊతం**

**కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు**

2

**అమరావతి, సింగిడి**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో గురువారం క్యాబినెట్ సమావేశం జరిగింది. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
4 సెప్టెంబర్ 2026

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు
# ఒవైసీ బ్రదర్స్ తక్కువేమీ కాదు

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.



**గత ప్రభుత్వంపై విమర్శలు**

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

**అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు**

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

**హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి**

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

## ఇరాన్‌ను అణుశక్తిగా
# మారకుండా నిరోధిస్తాం



అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజార హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# 5 కోట్లకు రేప్ కేసులు సెటిల్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 (సింగిడి):**

పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది. ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. "భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారి తీసింది.

## కేబినేట్‌లో
# బీసీ వర్గానికి ప్రాధాన్యత

**హైదరాబాద్,సెప్టెంబర్3 (సింగిడి):**

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మి కి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) చైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# అసెంబ్లీకి రండి.. అన్నీ తేల్చుకుందాం!

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న అవినీతి ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా సమాధానం చెబుతామని, కేటీఆర్, హరీష్‌రావులు మాజీ సీఎం కేసీఆర్‌ను వెంట బెట్టుకుని రావాలని సవాల్ విసిరారు.
ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
"ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారానికి దిగుతున్నారు" అని ఆరోపించారు.

**అప్పులు మీవి.. వడ్డీలు మేము కడుతున్నాం!**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మంత్రి అన్నారు.
ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశామని, మిగిలిన రెండింటినీ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.
రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యంతో పాటు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.
"బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాల పేరుతో నోటిఫికేషన్లు.. పేపర్ లీకేజీలే. కాంగ్రెస్ వచ్చాక 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం" అని మంత్రి పేర్కొన్నారు.



**కొప్పుల ఈశ్వర్‌కు వెయ్యి రోజుల లెక్క!**

ధర్మపురి రాజకీయాలపై కూడా మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు.
"నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ధర్మపురిలో చేసిన అభివృద్ధి పనులన్నింటి వివరాలతో వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను కొప్పుల ఈశ్వర్‌కు పంపిస్తా. అందులో ఒక్క తప్పు ఉన్నా చూపించండి.. దేనికైనా సిద్ధం" అని సవాల్ చేశారు.
ఎల్లంపల్లి భూ నిర్వాసితుల కోసం రూ.17 కోట్లు విడుదల చేయించడం, ధర్మపురికి డిగ్రీ కళాశాల, ధర్మారంలో ఐటీఐ, ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు, గోదావరి కాలుష్య నివారణకు రూ.17 కోట్ల సివరేజ్ ప్లాంట్, వివిధ అభివృద్ధి పనులకు రూ.141 కోట్లు వంటి కార్యక్రమాలను చేపట్టామని మంత్రి వివరించారు.

**411 కుల సంఘాల భవనాలు.. ప్రొసీడింగ్స్‌తో సరిపెట్టారా?**

కొప్పుల ఈశ్వర్ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ధర్మపురి నియోజకవర్గంలోని 411 కుల సంఘాల భవనాలకు ప్రొసీడింగ్స్ ఇచ్చి నిధులు ఇవ్వకుండా వదిలేశారని మంత్రి ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు.
రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తి, అక్కపల్లి లిఫ్ట్, పత్తిపాక రిజర్వాయర్, చెరువుల అభివృద్ధి, ధర్మపురికి శాశ్వత తాగునీటి పరిష్కారం వంటి అంశాలపై కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

**"పోలీసులను బెదిరించే పద్ధతి మానుకోవాలి"**

ధర్మపురిలో పనిచేస్తున్న పోలీసుల మనోభావాలను దెబ్బతీసేలా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతున్నారని అడ్లూరి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని, తనపై కూడా 17 కేసులు నమోదు చేశారని ఆరోపించారు.
"గతంలో మా కార్యకర్తలపై కేసులు పెట్టారు. ఇప్పుడు రెండేళ్లుగా ధర్మపురిలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదు" అని మంత్రి అన్నారు.

**"ఉనికి కోసమే బీఆర్ఎస్ ఆరాటం"**

బీఆర్ఎస్ రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోందని మంత్రి విమర్శించారు.
ప్రజలు మరోసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తారని, రేవంత్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి విషయంలోనైనా.. అవినీతి ఆరోపణల విషయంలోనైనా.. బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి వచ్చి ముఖాముఖి చర్చకు సిద్ధం కావాలని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మరోసారి సవాల్ విసిరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిజం దాచేందుకే బర్తరఫ్?

**సర్కార్ సమాధానం**

ఇంతటి తీవ్రమైన ఆరోపణలు రావడంతో.. వాటిపై ప్రభుత్వం లేదా కాంగ్రెస్ నుంచి స్పష్టమైన వివరణ ఏంటి అన్నది కీలకంగా మారింది. భూమి లావాదేవీలు, ధర, నిర్ణయ ప్రక్రియకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయా? అన్నదే ఇప్పుడు ప్రధాన అంశం. ఆరోపణలకు వాస్తవ ఆధారాలు ఉన్నాయా అన్నది తేలాల్సి ఉంది.

**సురేఖపై ఎందుకు వేటు?**

సుస్మిత వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాలని కొండా సురేఖ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ.. పార్టీ నాయకత్వంపై బహిరంగ విమర్శలు, క్రమశిక్షణ ఉల్లంఘన అంశాన్ని కాంగ్రెస్ తీవ్రంగా పరిగణించింది. దీంతో ఆమెపై వరుసగా క్రమశిక్షణ చర్యలు మొదలయ్యాయి.

**చివరకు మంత్రి పదవి పోయింది..**

క్రమశిక్షణ కమిటీ సిఫారసుల తర్వాత.. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఏఐసీసీ ఆమోదం తర్వాత గవర్నర్‌కు సిఫారసు పంపడంతో.. సుస్మిత వ్యాఖ్యలతో మొదలైన వివాదం మంత్రి పదవి తొలగింపు వరకు వెళ్లింది.

**బర్తరఫ్‌తో నిజం తేలిందా?**

ఇక్కడే అసలు చర్చ మొదలైంది. సురేఖను పదవి నుంచి తొలగించడం పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన నిర్ణయమా? లేక సుస్మిత ఆరోపణల ప్రభావం కూడా ఉందా? బర్తరఫ్ జరిగింది కాబట్టి ఆ వ్యాఖ్యలు నిజమని చెప్పలేం.. అదే సమయంలో అవి పూర్తిగా అవాస్తవమని కూడా తేల్చలేం. సుస్మిత ఆరోపణల్లో వాస్తవమెంత.. ఆధారమెంత.. అన్నది సంబంధిత పత్రాలు, అధికారిక విచారణతోనే తేలాల్సి ఉంది.

## కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన పవన్

**మంగళగిరి, సెప్టెంబర్ 3 (సింగిడి):**

మూత్రపిండాల వ్యాధి (క్రానిక కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్దానాన్ని తలపించే ప్రాంతం ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండలం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాదమని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ. 49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది.

**గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు**

ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి, కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలుపెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించలేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా తక్షణమే విడుదల చేసి, పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్లింది. కిడ్నీ వ్యాధితో ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఉప ముఖ్యమంత్రి, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయించారు. ఇబ్రహీంపట్నం ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను స్వీకరించి, అక్కడే శుద్ధి చేసి, 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల సహకారంతో దాదాపు 75,000 మందికి ఒక్కొక్కరికి రోజుకు 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పవన్ కళ్యాణ్ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, రైల్వే శాఖలతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పైప్‌లైన్ నిర్మాణానికి అత్యంత త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. గతంలో ఎ.కొండూరు మండల పరిధిలోని ప్రజలకు ట్యాంకర్ల సాయంతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ. 2.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. నేడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో జల్ జీవన్ మిషన్ – అమరజీవి జలధారల రూపంలో తాగునీటి సమస్యకు, తద్వారా కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభించినట్టయింది. త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించి తాగునీటి పథకం పనుల నాణ్యతను ఉప ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఇప్పటికే కార్యాలయ అధికారులకు నిర్దేశం చేశారు.



## ఇక బస్తా ఎత్తేది మెషినే!

ఇందులో భాగంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లో ఏర్పాటు చేసిన పలు యంత్రాల పనితీరును పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఐపీఎస్), మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్ (ఐఏఎస్), హాకా ఎండీ చంద్రశేఖర్ (ఐఏఎస్) గురువారం పరిశీలించారు.
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కీలకమైన శుభ్రపరిచే ప్రక్రియ, సంచుల్లో నింపడం, బస్తాలను తరలించడం, లారీల్లో లోడింగ్ వంటి పనులను యంత్రాల ద్వారా ఎంత వేగంగా నిర్వహించవచ్చో అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు.
ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్ ద్వారా ధాన్యాన్ని వేగంగా శుభ్రం చేయడంతో పాటు, ఆటోమేటిక్ బ్యాగ్ ఫిల్లింగ్ మిషన్‌తో సంచుల్లో ధాన్యాన్ని నింపే ప్రక్రియను పరిశీలించారు. అలాగే భారీ ధాన్యం బస్తాలను లారీల్లోకి సులభంగా ఎక్కించేందుకు వినియోగించే స్టాకర్ యంత్రాల పనితీరును కూడా చూశారు.

**కూలీలపై ఆధారపడటం తగ్గేలా..**

ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల సమయంలో కూలీల కొరత కారణంగా మార్కెట్ యార్డుల్లో పనులు ఆలస్యమవుతున్న పరిస్థితిని అధిగమించేందుకు యంత్రాల వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. యంత్రాల వినియోగంతో సమయం ఆదా కావడంతో పాటు ధాన్యం వృథా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.
భారీగా ధాన్యం వచ్చే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ ఈ యంత్రాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టనున్నారు. ఖరీఫ్ 2026–27 కొనుగోళ్ల సమయంలో రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా, కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది.
షాద్‌నగర్‌లో యంత్రాల పనితీరును పరిశీలించిన అనంతరం రాష్ట్రంలోని మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వీటి వినియోగంపై అధికారులు సమీక్షించనున్నారు.



## ఈడీ చేతికి వివేకా హత్య కేసు

**అమరావతి,సెప్టెంబర్3 (సింగిడి):**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక ద ష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక వ¶లాలను, మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది. హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరయ్యారు. గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చేపడుతున్న ఈ విచారణతో వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సూత్రధారుల చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది.


## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 (సింగిడి):**

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. ''ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి'' అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది భారత్–ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# సీఆర్డీఏ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

2026–27 మార్కెటింగ్ సీజన్‌లో తోతాపురి మామిడికి మద్దతు ధర అమలు చేసేందుకు అవసరమైన నిధులను వర్కింగ్ క్యాపిటల్ ద్వారా సమీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్ కు అనుమతిని పొడిగిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.
2026 సీజన్‌లో 94 మిలియన్ కిలోల తక్కువ రకం, నాణ్యత లేని పొగాకు కొనుగోలుకు ధరల లోటు భర్తీ మద్దతుగా కిలోకు రూ.10 చొప్పున పొగాకు రైతులకు నేరుగా నగదు బదిలీ ద్వారా అందించేందుకు ఏపీ మార్క్ ఫెడ్‌కు రూ.94 కోట్ల నిధులను సమకూర్చే ప్రతిపాదనకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.624.88 లక్షల విలువైన 78 వరద నష్ట పునరుద్ధరణ పనులకు పాలనా ఆమోదం తెలిపింది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని టన్నెల్–2లో కిలోమీటర్ 11.847 వద్ద ఉన్న టన్నెల్ బోరింగ్ మెషీన్ ను డిస్మాంట్లింగ్ చేసే పనులను, ప్రస్తుతం ప్రాజెక్టులో 18.787 కి.మీ. మేర పనులు చేపడుతున్న మెస్సర్స్ మేఘా సంస్థకు అప్పగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పనులకు రూ.11.63 కోట్ల వ్యయం చేయడానికి అనుమతి మంజూరు చేసింది.
మంగళగిరి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు సజావుగా పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది, రికరింగ్, నాన్ రికరింగ్ బడ్జెట్ అంశాలను పరిగణనలోకి తీసుకుని, మొత్తం 21 రెగ్యులర్ పోస్టులను మంజూరుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలోని ఈఎస్ ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు, అవసరమైన వైద్య, పారా మెడికల్ సిబ్బంది కేడర్ ను మంజూరు చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతి రాజధాని నగరంలో కొత్త భూ కేటాయింపులకు సంబంధించి మంత్రుల బృందం చేసిన సిఫార్సులను, సీఆర్డీఏ అథారిటీ తీర్మానం ఆమోదించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శాకమూరు వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్‌లతో "అమరావతి సంఘమం" నిర్మాణానికి రూ.759.793 కోట్ల అంచనా వ్యయానికి క్యాబినేట్ ఆమోదం తెలిపింది.



అమరావతి మీదుగా ఎర్రుపాలెం–నంబూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి 100 మీటర్ల బఫర్‌తో పాటు, క్యాపిటల్ సిటీ సరిహద్దు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు గ్రిడ్ రోడ్ల విస్తరణతో ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు, రైతుల అభ్యర్థన మేరకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ చేపట్టేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పించేందుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా కంతేరు గ్రామంలో 974 ఎకరాలు, తాడికొండ మండలం పరిధిలో 5,238.50 ఎకరాలు మొత్తం 6,212.50 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ చేసేందుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది.
ఏపీ "పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025–2029" ముసాయిదాకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, వ్యాధుల పర్యవేక్షణ నివారణ, బయోసెక్యూరిటీని మెరుగుపరచడం, గ్రామీణ/బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీని అభివృద్ధి చేయడం, పౌల్ట్రీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం, మార్కెట్, ఎగుమతి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
04-9-2026




## విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం

# బిఆర్ఎస్ నిరంతర పోరాటం

- కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు తీవ్ర అన్యాయం
- హామీల అమలులో ఘోర వైఫల్యం
- జీవో 97ను వెంటనే రద్దు చేయాలి
- ప్రభుత్వం మెడలు వంచి విద్యార్థుల సమస్యల పరిష్కారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, సెప్టెంబర్ 03 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. విద్యార్థి, యువతకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ పక్షాన నిరంతర పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 మోసాల పైన బిఆర్ఎస్ పార్టీ పోరుబాటలో భాగంగా గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా విద్యార్థులతో



కలిసి భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటి అమలులో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రధానంగా విద్యార్థులకు 5 లక్షల రూపాయల భరోసా కార్డు, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీ, అర్హులైన నిరుద్యోగ యువతకు ప్రతినెల రూ. 4,000 నిరుద్యోగ భృతి, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం.. అంశాలలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. జీవో నంబర్ 97 పేరుతో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థు ఆశలను అడియాశలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాట మాడకుండా, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థు లకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థి, యువజన నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లోనూ వైఫల్యం: బీఆర్ఎస్

### రామచంద్రపురంలో 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీతో వినూత్న నిరసన

### పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ధ్వజం

**రామచంద్రపురం, సెప్టెంబర్ 03(సింగిడి):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా, ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ విఫల పాలనపై చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం రామచంద్రపురం 268వ డివిజన్‌లో వినూత్న నిరసన చేపట్టారు. ఎన్నికల వేళ ఇచ్చిన గ్యారెంటీలను గుర్తుచేస్తూ ప్రజలకు 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ 1000 రోజుల పాలన సామాన్య ప్రజలకు నరకప్రాయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేశ్




యాదవ్ మాట్లాడుతూ, గత వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు శూన్యమ న్నారు. పాలకులు ప్రజా శ్రేయస్సును గాలికొదిలేసి తమ స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందన్నారు. ఇచ్చిన మాట తప్పడం, ప్రజలను మోసం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో మరింతగా ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నాయకులు పెద్ద రాజు, శ్రీకాంత్ రెడ్డి, బల్ల నర్సింగ్ రావు, తొంట నర్సింహ, కావాలి శ్రీరాములు, రవి, నాగరాజు, జైపాల్, రాములు యాదవ్, బుల్ల అశోక్, దశరథ్, అక్బర్, లక్ష్మీనారాయణ, యశ్వంత్, గడ్డం మల్లేష్ తదితర కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధితునికి అండగా బీఎస్పీ

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 03(సింగిడి):** బహుజన సమాజ్ పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు అడ్వకేట్ పల్లాం రమేష్ కురుమ ఆధ్వర్యంలో ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని బొంగులూరు గ్రామంలో జోగు స్వామి తండ్రి రాములు గారి ఇంటి ముందు గ్రామంలో గణేష్ మండప నిర్మాణానికి కావలసినంత స్థలం ఉన్నప్పటికీ రాకపోకల కు అడ్డంగా దురుద్దేశం తో కక్షపూరితంగా ఎటువంటి అనుమతులు లేకుండా "హైకోర్టు స్టేటస్ కో" ఉత్తర్వులను సైతం లెక్క చేయకుండా చేపట్టిన గణేష్ మండప నిర్మాణాన్ని వెంటనే ఆపాలని బాధితునికి న్యాయం చేయాలని కోరుతూ ఆదిభట్ల సర్కిల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సత్వరమే స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారుల కు ఫోన్ చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇంచార్జి బంగారుగళ్ల మహేందర్, మున్సిపాలిటీ మాజీ ఉపాధ్యక్షులు



లపంగి రాజు, కార్యదర్శి నెమలి సత్యనారాయణ, సీనియర్ నాయకులు బూతం రమణ, అడ్వకేట్ పల్లాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజలు కాంగ్రెస్ పాలనలో విసిగిపోయారు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని



**అమీర్పేట్, సెప్టెంబర్ 3 (సింగిడి):** దుర్మార్గపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి బల్కంపేట లోని సన్ రైజ్, ఈడెన్, అమరావతి, ఇంపీరియల్ అపార్ట్ మెంట్ ప్రాంతాలలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బయటి వాహనాలను తమ కాలనీకి వచ్చే రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న కారణంగా తాము రాకపోకలు సాగించాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తమ కాలనీలోని డ్రైనేజీ లైన్ దెబ్బతిని మురుగు నీరు రోడ్లపై కి చేరుతుందని పేర్కొనగా, వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే నూతన లైన్ ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయ్యి రోజుల పాలనలో బ్రహ్మాండ మైన అభివృద్ధి చేశామని పత్రికలలో పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చిన మీరు పరి పాలన, ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీలో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని, త్వరగా ఈ ప్రభుత్వం పోవాలని కోరుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఎస్సార్ నగర్ ఏ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ ఏఈ ఆశిష్, -రాజు వెంకట్, ఎలెక్ట్రికల్-రాజు మానిక, ట్రాఫిక్ అధికారి రోహిత్, ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు, బి ఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, కాలనీ వాసులు మల్లికార్జున్ గౌడ్, అమరావతి అపార్ట్మెంట్ వాసులు ఉమాదేవి, హుస్సేన్ బి, సుచిత్ర, మనీష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు నర్సింహ, కట్టా బలరాం, కుమార్, వసం శ్రీనివాస్, ఉత్తమ్ సింగ్, నారాయణ రాజు, పప్పు సింగ్, వలువురు తదితరులు ఉన్నారు.

## మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి కొలను హనుమంత రెడ్డి శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 3 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 291వ డివిజన్ షాపూర్ నగర్ కళావతి నగర్‌లో మల్టీపర్పస్ హాల్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి 18 లక్షల నిధులు మంజూరు కాగా, ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, కళావతి నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాలకృష్ణ, సిద్ధిగౌడ్ సంజీవ్ రెడ్డి, టీపీసీసీ సెక్రటరీ సంతోష్, గాడె వినోద్, కాలనీ సీనియర్ నాయకులు రజిత రత్నం, రజాక్, కృష్ణ, బుచ్చయ్య వల్లి, అచ్చమ్మ, నరసమ్మ, సంపంగి వెంకటేష్, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై సబ్బండ వర్గాలు దుమ్మెత్తి పోస్తున్నాయి

- బిఆర్ఎస్ రైతు నిర సన హోరదీక్షలో నేతల ఘాటు విమర్శలు

**వికారాబాద్, సెప్టెంబర్ 3(సింగిడి):** రాష్ట్రంలో సబ్బండ వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోస్తున్నాయని, రైతులకు నాటి కష్టాలను పునరావృతం చేశారని, ఎరువులకోసం రైతులు ఉసురు తీస్తున్న దగా కోరు ప్రభుత్వమని బి ఆర్ ఎస్ నేతలు ఘాటుగా విమర్శలు చేశారు. జిల్లా వ్యాప్తంగా బి ఆర్ ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు ఎరువులపై రైతుల నిరాహార దీక్షలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే లు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితర రాష్ట్ర నాయకులు జి నాగేందర్ గౌడ్, జెడ్పి మాజీ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్ లు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటులో ప్రధానమైన అంశం రైతులను సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా తదితర అంశాలతో నినదించి సాధించిన రాష్ట్రంలో వారి కష్టాలను స్వయం అనుభవంతో పరిశీలించిన అధినేత కేసీఆర్ రైతులకు కావాల్సిన సకల సౌకర్యాలను అమలు చేశారన్నారు. రైతులు గంటలో విద్యుత్ సరఫరా లేక, పెట్టుబడి లేక, సాగునీరు లేక, గిట్టుబాటు ధరలేక పెట్టుబడి లేక అప్పులకోసం చేయలు చాపిన రైతులకు కేసీఆర్ దేశంలో ఎక్కడ కనివిని ఎరుగని విధంగా రైతు బంధు పథకాన్ని అమలు చేసి రైతులకు పెట్టుబడి అందించి వారి కళ్ళల్లో ఆనందం చూసిన సూపరిపాలన అందించిన ఘనత నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వానిదని అన్నారు. అదేవిధంగా సాగునీటి కోసం ప్రాజెక్ట్ లు నిర్మించి, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయించి, రైతులు పండించిన పంటను కొనుగోలు చేసిన ఘనత నాటి ప్రభుత్వానిదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ



ఎన్నికల్లో సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి పరిపాలన చేతకాక బి ఆర్ ఎస్ ను దుషించడం తప్ప వారు సాధించిన ప్రగతి శూన్యమని నాయకులు విమర్శించారు. నేడు రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఎరువులు అందించడం చేతకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల కొరతను ఆడ్డెన్ వర్గతిని ప్రదేశ పెట్టి చేతగాని తనాన్ని కప్పి పుచ్చుకుంటున్నారని విమర్శించారు. విద్యుత్ సరఫరా విషయంలో నాటి కష్టాలు మరోసారి రైతులు ఎదుర్కొంటున్న దుస్థితి కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తున్నదని అన్నారు. నాడు ఎరువులు అనుకున్న సమయానికి అనుకున్నంత లభించాయని ఫోన్ చేస్తే ఆటో డ్రైవర్ కు చెబితే ఎరువులు రైతులకు పొలం వరకు వచ్చాయని అన్నారు. నేడు అజ్జెన్ పేరుతో సుదూర ప్రాంతాలలో అందుబాటులో ఉన్నాయని నమ్మబలికి అక్కడకి వెళ్ళే ఎరువులు అడిగితే ముందు చేయు చూపుతున్న తీరుతో రైతులు తీవ్రంగా నష్టపోవాలని ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు హరి గోస తీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి విషయంలో సహితం ఎక్కడి గొంగలి అక్కడే అన్న ధంధంగా ఉందని అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్ లో గెలుపొంది అభివృద్ధి పేరిట పార్టీ మారి అభివృద్ధి చెందారు తప్ప ఏలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ప్రధానంగా వికారాబాద్ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నాగేందర్ గౌడ్ చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ను ఉద్దేశించి పేర్కొన్నారు. రోడ్ల పరిస్థితిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న ప్రభుత్వానికి చలనం లేదని అన్నారు. రైతులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారికి రావాల్సిన ప్రయోజనాలు కూడా అందించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న ప్రతి ద్రోహాన్ని సామాన్యులకు సహితం తెలియజేసి ప్రభుత్వం బండారం బయటపెట్టాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గం, మండలం నాయకులు, రైతులు పాల్గొన్నారు.


## ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం వీడాలి

- మంజీరా నీటిలో డ్రైనేజీ కలుస్తున్నా జీహెచ్ఎంసీ అధికారుల్లో చలనం లేదా?
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించని డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యంత్రాంగం
- వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజా ఆందోళన తప్పదు
- బిఆర్ఎస్ సీనియర్ నేత కోటి హర్ష హెచ్చరిక

**రామచంద్రపురం, సెప్టెంబర్ 03 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం మండల్ పరిధిలోని తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, కొమరం భీమ్ కాలనీల్లో తీవ్రమైన పారిశుద్ధ్య లోపం, తాగునీటి కాలుష్యంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని తెల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోటి హర్ష తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరం భీమ్ కాలనీ



పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమై రోడ్లపై మురుగు నీరు పొంగిపొర్లుతోందని, అత్యంత దారుణంగా ఆ మురుగు నీరు తాగునీటి మంజీరా పైప్‌లైన్‌లో కలుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీటిని తాగి ప్రజలు, చిన్నపిల్లలు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు.



కాలనీవాసులు నిత్యం దుర్వాసన, అపరిశుభ్ర మధ్య బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నా అధికారులకు కనీస చీమ కుట్టినట్లైనా లేకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు, డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డికి ఫోన్ల ద్వారా ఫిర్యాదులు చేసినా, స్థానిక సమస్యలను గాలికొదిలేసి నిర్లక్ష్య సమాధానాలు చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలు పన్నులు కడుతున్నది అధికారుల నిర్లక్ష్యాన్ని భరించడానికేనా అని సూటిగా ప్రశ్నించారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి, డ్రైనేజీ లీకేజీలను అరికట్టడంతో పాటు సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని కోటి హర్ష హెచ్చరించారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల విధ్వంసంపై బీఆర్ఎస్ పోరుబాట


### కుత్బుల్లాపూర్, దుండిగల్ తహసీల్దార్ కార్యాలయాల ముందు బిఆర్ఎస్ పార్టీల ధర్నా, వినతిపత్రాలు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 3 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల దగా ప్రజా పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గ బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు 8 రోజుల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్వార్థపూరితంగా ప్రవేశపెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు తక్షణమే పంపిణీ చేయాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాలతో కుత్బుల్లాపూర్, దుండిగల్ తహసీల్దార్ కార్యాలయాల ముందు బైఠాయించి నిరసన ర్యాలీలు నిర్వహించారు. దుండిగల్ గండి మైసమ్మ తహసీల్దార్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పార్టీ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి అర్హులకు వెంటనే అందించాలని, 22-ఏ భూముల సమస్యలను పరిష్కరించి తక్షణమే ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ మండల కార్యాలయం దగ్గర 22ఏ సమస్యను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ళను అర్హులైన పేదవారికి అందజేయాలని గతంలో కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లను నిరుపేదలకు త్వరగతిన అందజేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ సుధాకర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## 'చేయూత' పెన్షన్ దరఖాస్తు గడువు పెంపు

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 03 (సింగిడి):** జిల్లాలో చేయూత పెన్షన్ పథకం కొత్త దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియకు సంబంధించి జిల్లా యంత్రాంగం కీలక మార్పులు, సడలింపులు చేసింది. దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేసే సమయంలో కొన్ని పత్రాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సిన నిబంధనను సడలించారు. ఈ ధృవీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోయినా, దరఖాస్తుల పరిశీలన (వెరిఫికేషన్) సమయంలో సంబంధిత అధికారులకు నేరుగా సమర్పించవచ్చని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలు తహసీల్దార్, ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ జారీ చేసే స్థానిక విచారణ నివేదిక ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి కాదు. మరణించిన భర్తకు సంబంధించిన మరణ ధృవీకరణ పత్రం, ఆధార్ వివరాలు అప్‌లోడ్ తప్పనిసరి కాదన్నారు. దివ్యాంగులు సదరమ్, యూడీఐడీ ధృవీకరణ పత్రం ఆన్‌లైన్ అప్‌లోడ్ తప్పనిసరి కాదని ప్రకటనలో పేర్కొన్నారు. కల్లుగీత కార్మికులు దరఖాస్తు చేసేటపుడే సమయంలో 'ట్రీ ఫర్ ట్యాపర్' కింద సర్టిఫికెట్ నిలిచే గుర్తింపు కార్డును అప్‌లోడ్ చేయాలి. ఈ ధృవీకరణ పత్రాన్ని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లేదా సీఐ ద్వారా జారీ చేయాల్సి ఉంటుంది. చేనేత కార్మికులు ఏడీ హ్యాండ్లూమ్స్ ద్వారా జారీ చేయబడిన ధృవీకరణ పత్రం లేదా గుర్తింపు కార్డును సమర్పించాలి. గతంలో పెన్షన్ మంజూరై, వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన (ప్రస్తుతం లైవ్ కాని) వారు కొత్త దరఖాస్తు ఫారం ద్వారా తమ వివరాలను తిరిగి నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పెన్షన్ దరఖాస్తుల వివరాలను సాధారణ ప్రజలు సులభంగా తెలుసు కునేందుకు 'సెర్ప్ ఆసరా' సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.



## 1000 రోజుల కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజల హర్షం

- ఘనంగా బైక్ ర్యాలీ

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 3 (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. 283వ డివిజన్ ఐడీపీఎల్ డి మార్ట్ నుంచి ప్రారంభమైన ఈ భారీ బైక్ ర్యాలీలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ



రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి. శివకుమార్, 283వ డివిజన్ ప్రెసిడెంట్ కనకరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొలన్ హన్మంత్ రెడ్డి, 281వ డివిజన్ అధ్యక్షుడు జలీల్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిమి రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కాశ్యం ప్రకాష్, మైనారిటీ అధ్యక్షుడు అజర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళీ, భాస్కర్, వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు మాధవి రాణి, చిన్నమ్మ, నీల గుప్త, లక్ష్మీ రెడ్డి, లక్ష్మీ, భాగ్య పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## ఆసుపత్రిలో అరాచకం: సుప్రీంకోర్టు ఆగ్రహం...

### వైద్యుడి తెల్లకోటుపై రక్తం మరకలా?

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అన్న ఆర్యోక్తి ప్రకారం సకల పురుషార్థాల సాధనకు మూలాధారం మానవ దేహమే కాగా, ఆ దేహానికి అపాయం వాటిల్లిన వేళ అమృత హస్తంతో సేదతీర్చి పునర్జన్మనిచ్చే ప్రత్యక్ష దైవం వైద్యుడు. మన సనాతన సంస్కృతి "వైద్యో నారాయణో హరిః" అని కీర్తించింది అందుకే. ఆపదలో ఉన్న జీవికి ఆయువును ప్రసాదించే ధన్వంతరి స్వరూపంగా, మృత్యువు ఒడిలోకి జారుకుంటున్న ప్రాణాన్ని తన విద్యాప్రజ్ఞలతో వెనక్కి లాక్కొచ్చే ధైర్యమూర్తిగా వైద్య వృత్తి సమాజంలో అగ్రతాంబూలం అందుకుంది. అటువంటి పవిత్రమైన ప్రాంగణాల్లో, ప్రాణ రక్షణ కోసం వెలసిన వైద్యాలయాల్లో సేవామూర్తులైన వైద్యులు, పరిచారికలపై కర్కశంగా భౌతిక దాడులు జరగడం నాగరిక సమాజానికే చెరగని మాయని మచ్చ. రోగి గుండె చప్పుడును ఆలకించే కర్ణభేరిపై పిడిగుద్దులు కురవడం, ప్రాణాపాయం నుంచి గట్టెక్కించే సంజీవని హస్తాలపై లాఠీలు, రాడ్లతో దాడులు చేయడం అనాగరికతకు పరాకాష్ఠ. ఇటీవల మహారాష్ట్రలోని కళ్యాణ్ నగరంలో వెలుగుచూసిన దారుణ ఉదంతంపై దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన కఠిన వ్యాఖ్యలు ఈ వికృత పోకడలపై సమగ్ర సమాజాన్ని నిలదీసేలా చేశాయి.

కళ్యాణ్-డొంబివ్లీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శాస్త్రినగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో తొమ్మిది నెలల నిండు గర్భిణి ప్రసవ వేదనతో చేరిన సమయంలో చికిత్సలో జాప్యం జరిగిందన్న ఆరోపణలతో రేగిన వివాదం, అంతిమంగా అరాచకానికి దారితీసింది. ఆసుపత్రికి చేరుకున్న స్థానిక కార్పొరేటర్ రమేశ్ సుర్క్యా మ్హాత్రే, తన అనుచరులతో కలిసి కర్తవ్య నిర్వహణలో నిమగ్నమైన వైద్యులు, సిబ్బందిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డ దృశ్యాలు నిఘా నేత్రాల సాక్షిగా బహిర్గతమయ్యాయి. ఈ ఉదంతంపై నమోదైన క్రిమినల్ కేసులో దిగువ న్యాయస్థానం నిందితుడికి పూచీకత్తుపై జామీను మంజూరు చేయగా, బాంబే హైకోర్టు స్వచ్ఛందంగా జోక్యం చేసుకుని ఆ జామీనును రద్దు చేస్తూ నిందితుడిని లొంగిపోవాలని ఆదేశించింది. అనంతరం నిర్దిష్ట నిబంధనలతో జామీను లభించినప్పటికీ, సదరు ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం నిప్పులు చెరిగింది. "ఆసుపత్రిలోకి అక్రమంగా చొరబడి విధుల్లో ఉన్నవారిపై విచక్షణారహితంగా దాడి చేస్తారా? ప్రాణభయంతో వణికిపోయే వైద్య సిబ్బంది సామాన్య ప్రజలకు ఎలా చికిత్స అందించగలరు? గుంపు దాడికి గురైన వ్యక్తి అనుభవించే మానసిక నరకం ఎంతటిదో ఊహించగలరా?" అంటూ న్యాయపీఠం సంధించిన సూటి ప్రశ్నలు దేశవ్యాప్తంగా వైద్యుల హృదయాలకు ఊరటనిచ్చాయి. ఈ క్రమంలో నిందితుడి జామీనును పూర్తిగా రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించడం చట్టం ఎంతటి కఠినంగా వ్యవహరించనుందో చాటిచెప్పింది.

ఈ ఒక్క ఘటన మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా వైద్యులపై నిరంతరం పెరుగుతున్న దాడుల పరంపర వ్యవస్థాగత సంక్షోభాన్ని కళ్లకు కడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం అంతర్జాతీయంగా సుమారు 8 నుంచి 38 శాతం మంది ఆరోగ్య కార్యకర్తలు తమ సేవా జీవితంలో ఏదో ఒక దశలో ప్రత్యక్ష భౌతిక హింసను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో పరిస్థితి మరింత విషాదకరంగా ఉంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం, అత్యవసర విభాగాల్లో సేవలందించే 75 శాతానికి పైగా వైద్యులు రోగుల బంధువుల చేతిలో దుర్భాషలు, శారీరక హింసను అనుభవిస్తున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి విషమించడం, విషాదకర రీతిలో మరణం సంభవించడం, మౌలిక సదుపాయాల లేమి వల్ల జరిగే జాప్యం, అత్యధిక వైద్య ఖర్చులు, రోగి కుటుంబంతో సంభాషించడంలో ఏర్పడే భావవ్యక్తీకరణ లోపాలు తదితర కారణాలు ఉద్రిక్తతలకు బీజం వేస్తున్నాయి. అయితే, వేదన ఎంత తీవ్రమైనదైనా, కోపం ఎంత కట్టలు తెంచుకున్నా, హింస ఏ రూపంలోనూ సమర్థనీయం కాదు. చికిత్సలో నిర్లక్ష్యం జరిగితే వినియోగదారుల ఫోరమ్‌లు, నేషనల్ మెడికల్ కమిషన్, న్యాయస్థానాలు వంటి చట్టబద్ధమైన వేదికలు ఉన్నప్పుడు, చట్టాన్ని స్వయంగా చేతుల్లోకి తీసుకుని హింసాకాండ సాగించడం అక్షంతవ్యమైన నేరం.

మరోవైపు, ఆరోగ్య రంగంలో నెలకొన్న లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సిన మహత్తర బాధ్యత పాలక యంత్రాంగంపై ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగుల తాకిడికి అనుగుణంగా మౌలిక వసతులు, ఆధునిక పరికరాలు, నిష్ణాతులైన సిబ్బంది కొరతను తీర్చకపోతే అసహనం ఆగ్రహంగా మారుతుంది. రోగుల బంధువులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించే సమర్థ కమ్యూనికేషన్ వ్యవస్థలు, తగినంత భద్రతా సిబ్బంది ఏర్పాటు అత్యంత ఆవశ్యకం. ప్రాణాలను కాపాడాల్సిన వైద్యుడే ప్రాణరక్షణ కోసం భయపడుతూ, చేతులు వణుకుతూ స్టెతస్కోప్ పట్టుకునే దుస్థితి ఏర్పడితే, ఆ భయం పరోక్షంగా లక్షలాది మంది నిస్సహాయ రోగుల ప్రాణాలకే ముప్పుగా పరిణమిస్తుంది. నిరంతర ఆందోళనల మధ్య జరిగే వైద్యం ఎన్నటికీ ఉత్తమ ఫలితాలను ఇవ్వలేదు. వైద్యుడికి స్వేచ్ఛాయుత, భయరహిత పని వాతావరణాన్ని కల్పించడం అనేది వైద్యుల వ్యక్తిగత హక్కు మాత్రమే కాదు, అది ప్రతి పౌరుడి జీవించే రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కుకు రక్షణ కవచం. వైద్యులపై దాడికి దిగే అరాచక శక్తులపై అపరాధ పరిశోధన వేగవంతమై, కఠిన శిక్షలు పడినప్పుడే ఇటువంటి పైశాచిక ప్రవర్తనకు అడ్డుకట్ట పడుతుంది. ప్రాణదాతను గౌరవించడం, వారి భద్రతకు కట్టుబడి ఉండటం నాగరిక సమాజం తనను తాను కాపాడుకోవడమే అవుతుంది. వైద్యుడి తెల్లటి కోటు సమాజ నిస్వార్థ సేవకు సంకేతం; ఆ కోటుపై రక్తపు మరకలు పడకుండా కాపాడుకున్నప్పుడే జాతి సమగ్ర ఆరోగ్యం, మనుగడ సురక్షితంగా వర్ధిల్లుతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్**
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

# యుద్ధం అక్కడ.. మంట ఇక్కడ!

### చమురు ధరల పెరుగుదలతో భారత్‌కు కొత్త ఆర్థిక సవాల్

ప్రపంచ పటంలో పశ్చిమాసియా ఒక ప్రాంతం మాత్రమే కావచ్చు. కానీ అక్కడ చెలరేగే యుద్ధ మంటల ప్రభావం మాత్రం ప్రపంచంలోని ప్రతి దేశానికీ చేరుతుంది. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్‌కు పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరోసారి పెద్ద ఆర్థిక పరీక్షగా మారుతున్నాయి. అమెరికా--ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు తాజాగా చమురు సరఫరాపై




ఆందోళనలను పెంచాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 95--96 డాలర్ల స్థాయికి చేరడంతో భారత స్టాక్ మార్కెట్లపై కూడా ప్రతికూల ప్రభావం పడింది. సెప్టెంబర్ 2న సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగియడానికి చమురు ధరల పెరుగుదల, భౌగోళిక ఉద్రిక్తతలు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

**చమురు పెరిగితే.. సామాన్యుడిపై భారం**

భారత్ తన చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది. అంతర్జాతీయంగా క్రూడ్ ధర పెరిగితే దేశం చెల్లించాల్సిన దిగుమతి బిల్లు పెరుగుతుంది. దాని ప్రభావం రూపాయి విలువ, రవాణా ఖర్చులు, పరిశ్రమల ఉత్పత్తి వ్యయం, చివరకు వినియోగదారుడి జేబుపై పడే అవకాశం ఉంటుంది. పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే పెరగకపోయినా ప్రభావం అక్కడితో ఆగదు. రవాణా ఖర్చులు పెరిగితే కూరగాయల నుంచి నిత్యావసర సరుకుల వరకు ధరలపై ఒత్తిడి వస్తుంది. పరిశ్రమల ఉత్పత్తి వ్యయం పెరిగితే వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అంటే చమురు ధర పెరుగుదల ఒక చైన్ రియాక్షన్ లాంటిది.

**వృద్ధి బలంగా ఉన్నా.. ముప్పు బయట నుంచే**

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలమైన వృద్ధి రేటును నమోదు చేస్తోంది. 2026 ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని తాజా నివేదికలు చెబుతున్నాయి. అయితే ఇదే సమయంలో అధిక చమురు ధరలు, ప్రపంచ మార్కెట్లలో అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు ఆ వృద్ధికి సవాలుగా మారుతున్నాయి. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నంత మాత్రాన సరిపోతుందా? ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ఒక భాగం. అంతర్జాతీయ చమురు ధరలు, డాలర్ విలువ, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతూనే ఉంటాయి. స్టాక్ మార్కెట్ కంటే పెద్ద సమస్య మార్కెట్ పడిపోవడం సాధారణ పెట్టుబడిదారుడికి కనిపించే మొదటి సంకేతం మాత్రమే. అసలు సమస్య అంతకంటే పెద్దది. చమురు ధరలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే ప్రభుత్వం చమురు దిగుమతుల కోసం ఎక్కువ విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో కరెంట్ అకౌంట్‌పై ఒత్తిడి పెరగవచ్చు. రూపాయి విలువపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరిగితే వడ్డీ రేట్ల విషయంలో రిజర్వ్ బ్యాంక్‌కు విధానపరమైన సవాళ్లు ఎదురవుతాయి. అంటే ఒకవైపు వృద్ధిని కొనసాగించాలి, మరోవైపు ధరలను అదుపులో ఉంచాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం పాలకులకు పెద్ద పరీక్ష.

**ప్రత్యామ్నాయ ఇంధనాల దీర్ఘకాల పరిష్కారమా?**

ఇక్కడ మరో విషయం స్పష్టమవుతోంది. చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించకుండా భారత్ పూర్తిస్థాయి ఆర్థిక భద్రత సాధించడం కష్టం. సౌర, పవన విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన రంగాల్లో పెట్టుబడులు పెరగాలి. అయితే కేవలం ఉత్పత్తి సామర్థ్యం పెంచడం సరిపోదు. విద్యుత్ నిల్వ వ్యవస్థలు, ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్, గ్రిడ్ సామర్థ్యం కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందాలి. ప్రస్తుతం భారత్‌లో సౌర విద్యుత్‌లో కొంత భాగం గ్రిడ్ పరిమితులు, నిల్వ సామర్థ్యం కొరత కారణంగా వినియోగంలోకి రాకుండా పోతోందని తాజా విశ్లేషణలు సూచిస్తున్నాయి.

**సామాన్యుడికి ప్రభుత్వం ఏం చేయాలి?**

అంతర్జాతీయ పరిణామాలను ప్రభుత్వం నియంత్రించలేకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే చర్యలు మాత్రం తీసుకోవచ్చు. చమురు ధరలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే పన్నుల విధానం, వ్యూహాత్మక చమురు నిల్వలు, ప్రత్యామ్నాయ దిగుమతి మార్గాలు, దేశీయ ఇంధన ఉత్పత్తి వంటి అంశాలపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అవసరమైన వస్తువుల ధరలు అదుపు తప్పకుండా సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రధానంగా సామాన్యుడి కొనుగోలు శక్తి దెబ్బతినకుండా చూడటం అత్యంత ముఖ్యం.

**యుద్ధం ముగిసే వరకు ఆందోళన తప్పదా?**

పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఎంతకాలం కొనసాగుతాయన్నది ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక ప్రశ్న. యుద్ధం పొడిగితే చమురు సరఫరాపై మరింత ఒత్తిడి రావచ్చు. దాని ప్రభావం భారత్ సహా చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలపై ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇప్పుడు భారత్ ముందున్న సవాలు కేవలం చమురు ధరలను ఎదుర్కోవడం కాదు. అది ఆర్థిక స్వావలంబనను వేగవంతం చేయడం. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం మన వంటింటి బడ్జెట్‌పై పడే పరిస్థితి మారాలంటే దేశం ప్రత్యామ్నాయ ఇంధనాలు, దేశీయ ఉత్పత్తి, సరఫరా భద్రతపై మరింత దృష్టి పెట్టాలి. యుద్ధం ఆగాలని ప్రపంచం కోరుకోవడం సహజం. కానీ యుద్ధం జరిగినా భారత ఆర్థిక వ్యవస్థ కుదేలుకాకుండా ఉండే శక్తిని నిర్మించుకోవడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. అదే ఈ సంక్షోభం మనకు నేర్పుతున్న అతిపెద్ద పాఠం.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

### సాటిలేని మేటి జ్యోతిశ్శాస్త్ర

# ఘనాపాఠి భమిడిపాటి

### 6 వేల సంవత్సరాల క్యాలెండర్ రూపకర్త... 150 చిత్రాల కథా రచయిత
### సెప్టెంబర్ 4... భమిడిపాటి రాధాకృష్ణ వర్ధంతి



కాలచక్రంతో పాటు గ్రహగతులనూ, జ్యోతిశ్శాస్త్రాన్నీ కూలంకషంగా అధ్యయనం చేసి అక్షరాలకూ, సంఖ్యలకూ బ్రహ్మముడులు వేస్తూ ఒక వ్యక్తి పేరులోంచి వారు పుట్టిన సమయాన్ని వెలికి తీసేందుకు తెలుగు భాషలోని అసంఖ్యాక గుణింతాలతో కూడిన ఒక నిర్దిష్ట సూత్రం రూపొందించి దాని ఆధారంగా జాతకాలను అధ్యయనం చేస్తూ జ్యోతి శ్శాస్త్రంలో ఓ వినూత్న ధోరణిని ప్రవేశపెట్టి ఆ శాస్త్రం విలువను ప్రపంచానికి అందిస్తూ ఎందరికో భవిష్యన్మార్గదర్శకం చేసింది ఒక ఆంధ్రుడేనే విషయం చాలా మందికి తెలియదు.

అప్పటి వరకూ అనుసరిస్తున్న గణన పద్ధతిలో ఖచ్చితత్వం సరిగా లేక, లోప భూయిష్టమై, తప్పుల తడకలతో నడకలు సాగిస్తున్న ప్రపంచ కాలచక్ర గతులు సరిచేసే నిమిత్తం 45 బి.సి నుంచి 5,555 ఎ.డి వరకూ ఆంగ్ల క్యాలెండర్‌ను సరిదిద్ది సరికొత్త భమిడిపాటి కేలెండర్‌ను రూపొందించిన మేటి విజ్ఞానవేత్త మన తెలుగుబిడ్డ కావడం అది నిజంగా గర్వకారణ అంశం కాక మరేమిటి?

సూర్యుని చుట్టూ భూమి చేసే భ్రమణానికి పట్టే సమయం 365.25 రోజులంటూ ప్రపంచం అప్పటి వరకూ నమ్ముతున్న సూత్రాలను తిరగరాసి, ఈ భ్రమణానికి 365.2422 రోజులు పడుతుందంటూ గణిత సూత్రాల ఆధారంగా ఖచ్చితంగా నిరూపించి నిర్ధారించిన మహా శాస్త్రవేత్త, సాటిలేని జ్యోతిశ్శాస్త్ర మేటి ఘనా పాటి భమిడిపాటి రాధాకృష్ణ. భాషా వ్యాకరణ, ఖగోళ, గణితశాస్త్ర సూత్రాలతో అనుసంధానమై నిర్దిష్ట ఫలితాలను నిక్కచ్చిగా అందించే విజ్ఞాన గని అని నిరూపించి, తన వాస్తవిక దృక్పథాన్ని నిరూపించు కున్న వ్యక్తిత్వం ఆయన సొంతం. రాధాకృష్ణ వ్యాకరణ, ఖగోళ, గణిత శాస్త్రాలను అనుసంధానించి అధ్యయనం చేయడం ద్వారా జ్యోతిశ్శాస్త్ర మూలాలను మర్ధించి అసామాన్య జ్యోతిశ్శాస్త్రవేత్తగా ప్రశంసా పాత్రులైనారు. జ్యోతిశ్శాస్త్రంలో పూర్వం నుంచీ ఉన్న ఆ శాస్త్ర గ్రంథాలైన సారావళి, బృహజ్జాతకం, పరాశర గ్రంథం, జాతక మార్తాండ, జాతక సర్వస్వం, జాతక చంద్రిక, కేరళీయం ఇత్యాది గ్రంథాల్లో నిర్దిష్ట అంశంపై పరస్పర విరుద్ధమైన ఫలితాలు పేర్కొనబడడం రాధాకృష్ణ గమనించారు. అనంతరం వాస్తవిక దక్పథంతో ఈ శాస్త్ర గ్రంథాల నిగ్గు తేల్చేందుకు 40 ఏళ్ల పైబడిన వారికి చెందిన 2,600 జాతకాలు, 72 మంది కవలల జాతకాలు సేకరించి పరిశోధించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లీషు కాలెండర్‌లో తప్పు ఉందని రుజువు చేసి, దానిని సరి చేసుకొనే విధానాన్ని సూచిస్తూ 1990లో "ది భమిడిపాటి కేలెండర్"ను ఆంగ్లంలో పుస్తక రూపంలో ప్రచురించారు. జపాన్, లండన్ లాంటి విదేశాల్లో ఈ క్యాలెండర్ విడుదలై, విక్రయించ బడి సంచలనం సష్టించింది. ప్రపంచంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి కాగా అయన అపూర్వ కృషి... విజ్ఞులు, విమర్శకుల మన్ననలందుకుంది. ఇది ఆంధ్రులందరికీ గర్వకారణం.

తన మరణాన్ని సూచించేలా అన్యాపదేశంగా సెప్టెంబర్ 4వ తేదీన ఈ లోకాన్ని వదులుతానని ముందుగానే తన డైరీలో రాసుకున్న రాధాకృష్ణ రాతలు ఆయన నుదుటి మీద గీతలేనన్న వాస్తవాన్ని ఎవరూ ఊహించ లేకపోవడం గమనార్హం.

భమిడిపాటి రాధాకృష్ణ 24-11-1929 వ తేదీన రాజమండ్రిలో జన్మించారు. అక్కడే శ్రీ వీరేశలింగం ఉన్నత పాఠశాల లోను, తరువాత రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి, 1949లో బీ.ఎస్సీ పట్టభద్రు లయ్యారు. తండ్రి శ్రీ కామేశ్వరరావు ఖ్యాతిగాంచిన హాస్య రచయిత కాగా... ఆయన రచనాభినివేశాన్ని తన జీన్స్‌లోనూ జీర్ణించుకున్నారు రాధాకృష్ణ.

భమిడిపాటి రాధాకృష్ణ (నవంబరు 24, 1929 - సెప్టెంబరు 4, 2007) లబ్ధ ప్రతిష్టులైన నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు. అయన హాస్య రచయిత. "హాస్య బ్రహ్మ" భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు.

రాధాకృష్ణ బహుముఖ ప్రజ్ఞశాలి. ఆయన మొదటి రచన భజంత్రీలు నాటిక. దీన్ని మొదటిసారిగా 25-2-1950 వ తేదీన రాజమండ్రిలో ఆర్ట్స్ కాలేజి పూర్వ విద్యార్థి వార్షికోత్సవ సందర్భంలో ప్రదర్శించారు. అయన 3 నాటకాలు, 6 నాటికలు రచించగా ప్రతీ ఒక్కటీ వెయ్యి ప్రదర్శనలకి పైగా ప్రదర్శింపబడి నాటకరంగ ఖ్యాతిని ఇనుమడింప చేశాయి. అవి కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదం అయినాయి.

"ఇదేమిటి, కీర్తిశేషులు, మన స్తత్వాలు, భజంత్రీలు, దంత వేదాంతం" వంటి నాటికలు, నాటకాలు వ్రాశారు. రావుగోపాల రావు 'కీర్తిశేషులు' లోని ఒక పాత్ర ధరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినీ పరిశ్రమలోనూ అడుగు పెట్టాడు. 28-1-1952న రాజమండ్రిలో జరిగిన సన్మాన సభలో, ఆ సభకి అధ్యక్షత వహించిన శ్రీ అక్కినేని నాగేశ్వర రావు ఆధ్వర్యాన, రాధాకృష్ణకు "దృశ్య కావ్య ధురీణ" అనే గౌరవ పురస్కారం జరిపారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదన రావు ప్రోద్బలంతో సినీ రంగంలోకి ప్రవేశించి 150 సినిమాలకు కథలందించారు. ఇందులో కె.విశ్వనాథ్ తొలి చిత్రమైన "ఆత్మగౌరవం" కూడా ఉంది. బ్రహ్మచారి, కథానాయకుడు, కీర్తిశేషులు, మరపురాని కథ, విచిత్ర కుటుంబం, పల్లెటూరి బావ, ఎదురులేని మనిషి, గోవుల గోపన్న, సీతారామ కళ్యాణం, నారీనారీ నడుమ మురారి, కాలేజీ బుల్లోడు వంటి వాటితో సహా తెలుగు పలు చిత్రాలకు కథలు వ్రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు ఆయన సన్నిహితులు. 1994 తర్వాత క్రమంగా ఆయన సినిమా రంగానికి దూరమయ్యారు. తనకు ఎంతో ఇష్టమైన గణిత రంగంపై మక్కువ చూపారు. భమిడిపాటి రాధాకృష్ణ క్యాలెండర్ పేరిట క్రీస్తుపూర్వం 45 నుంచి క్రీస్తుశకం 5555 వరకు అంటే ఆరు వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించారు. జ్యోతిష రంగంలో కూడా ఆయనకు పట్టు ఉంది. సంఖ్యాశాస్త్ర పరంగానే కాకుండా చిన్నారుల నామకరణ సమయంలో బియ్యంలో రాసే అక్షరాలను బట్టి కూడా ఆయన జాతకాలు చెబుతారనే పేరు సంపాదించు కున్నారు. ఆయన 79 సంవత్సరాల వయస్సులో రాజమండ్రిలో మరణించారు. భజంత్రీలు, దంత వేదాంతం; కీర్తిశేషులు; మన స్థత్వాలు; తరం-అంతరం; తదితర నాటకాలను ఆయన రచించారు. ఆత్మ గౌరవం (1965) (డైలాగ్స్ రచయిత); మరపురాని కథ (1967); కథానాయకుడు (1969); అల్లుడే మేనల్లుడు (1970); ఆడ జన్మ (1970); బొమ్మా బొరుసా (1971); రామ రాజ్యం (1973); ఆడపిల్లల తండ్రి (1974); అల్లుడొచ్చాడు (1976); పొగరు బోతు (1976); మనిషి రోడ్డున పడ్డాడు (1976);సాహస వంతుడు (1978); షోకిల్లా రాయుడు (1979); నారి నారి నడుమ మురారి తదితర చిత్రాలకు సంభాషణలు రాశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్**
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

### వెన్న దొంగ కృష్ణయ్య...

# ఉట్టి కొట్టే సందడయ్యా!

కృష్ణాష్టమి అనగానే భక్తి, భజనలు, దేవాలయాల వెలుగులు గుర్తుకొస్తాయి. కానీ పల్లె వీధుల్లో, పట్టణ కూడళ్లలో మరో మధురమైన దృశ్యం కనిపిస్తుంది--- ఎత్తున వేలాడే ఉట్టి, దాన్ని కొట్టేందుకు పోటీ పడే యువకులు, చుట్టూ కేరింతలు! బుల్లి కృష్ణుడి చిలిపి బాల్యాన్ని తరతరాలకు గుర్తుచేసే ఈ ఉట్టి సంబరమే కృష్ణాష్టమి పండుగకు ప్రత్యేకమైన రంగు. పాలు, పెరుగు, వెన్న అంటే ఇష్టపడే బాలకృష్ణుడి లీలలు పురాణ కథనాల్లో ప్రసిద్ధం. కృష్ణుడి చిలిపి అల్లరి నుంచి తప్పించుకోవడానికి గోపికలు వెన్న, పెరుగు కుండలను



అందనంత ఎత్తులో దాచేవారని చెబుతారు. కానీ కృష్ణయ్య మాత్రం తన స్నేహితులతో కలిసి ఒకరి భుజాలపై మరొకరు ఎక్కి ఉట్టిని చేరుకునేవాడని విశ్వాసం. ఆ బాలలీల జ్ఞాపకమే నేడు ఉట్టి కొట్టే సంప్రదాయంగా పండుగలో భాగమైంది.

మన గ్రామాల్లో కృష్ణాష్టమి వచ్చిందంటే ముందుగానే సందడి మొదలవుతుంది. వీధి మధ్యలో తాడుకు మట్టి కుండను కడతారు. అందులో పెరుగు, వెన్న, పండ్లు, నాణేలు ఉంచుతారు. యువకులు బృందాలుగా చేరి ఉట్టిని కొట్టేందుకు పోటీ పడతారు. డప్పుల మోతలు, పాటలు, చప్పట్లు, కేరింతల మధ్య కుండ పగిలిన క్షణం ఆనందం పొంగిపొర్లుతుంది. రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ సాగే ఈ వేడుకలో భక్తి, బాల్యం, సంబరం కలిసిపోతాయి.

భారతదేశంలో ఈ సంప్రదాయానికి అత్యంత వైభవాన్ని ఇచ్చిన రాష్ట్రాల్లో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. అక్కడ దీనిని దహీ హండిగా పిలుస్తారు. ముంబై, థానే వంటి ప్రాంతాల్లో గోవింద బృందాలు ఒకరిపై మరొకరు నిలబడి మానవ పిరమిడ్‌లుగా ఏర్పడతాయి. ఎత్తున కట్టిన హండీని పగులగొట్టేందుకు చేసే ప్రయత్నం ఉత్కంఠను రేపుతుంది. వేలాది మంది ప్రేక్షకుల కేరింతల మధ్య జరిగే ఈ సంబరం కృష్ణాష్టమి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

అదే సమయంలో, శ్రీకృష్ణుడి జన్మస్థలంగా విశ్వసించే మథురలో జన్మాష్టమి భక్తి వైభవం ప్రత్యేకంగా కనిపిస్తుంది. మథురతో పాటు వృందావనం, గోకుల్ వంటి బ్రజ్ ప్రాంతాలు కృష్ణనామస్మరణతో మారుమోగుతాయి. ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలతో బాలకృష్ణుడి జన్మాన్ని భక్తులు ఆనందోత్సాహాలతో స్మరిస్తారు. ఒకవైపు మథురలో భక్తి పరవశం, మరోవైపు మహారాష్ట్రలో దహీ హండి ఉత్సాహం-ఈ వైవిధ్యమే కృష్ణాష్టమి విశిష్టత.

ఉట్టి కొట్టడం కేవలం కుండ పగులగొట్టే ఆట కాదు. ఒక్కడి శక్తితో అందని లక్ష్యాన్ని కలిసి సాధించవచ్చనే సందేశం అందులో ఉంది. కింద నిలిచినవారి బలం, పైకి ఎక్కినవారి ధైర్యం, చుట్టూ ఉన్నవారి ప్రోత్సాహం- అన్నీ కలిస్తేనే ఉట్టి అందుతుంది. అందుకే ఈ పండుగలో స్నేహం ఉంది, ఐక్యత ఉంది, ఉత్సాహం ఉంది. ఉట్టి ఎత్తులో ఉండొచ్చు... కానీ చేతులు కలిస్తే దూరం తగ్గిపోతుంది. వెన్న దొంగిలించిన బుల్లి కృష్ణుడి చిలిపి నవ్వులో ఎంత మాధుర్యం ఉందో, ఉట్టి పగిలిన క్షణంలో వినిపించే కేరింతల్లోనూ అంతే మాధుర్యం ఉంది. కుండ పగిలేది ఒక్కక్షణమే... కానీ ఆ ఆనందం తరతరాల జ్ఞాపకంగా మిగులుతుంది.
జై కృష్ణ!

**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్టు**



# ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి




- భక్తి, క్రమశిక్షణ, సామరస్యానికి ప్రతీకగా ఉత్సవాలు నిలవాలి
- పోలీస్ శాఖ

**కరీంనగర్, సెప్టెంబర్ 3(సింగిడి):** గణేష్ ఉత్సవాలు--2026ను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని పోలీస్ అధికారులు సూచించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి ఊరేగింపు, నిమజ్జనం వరకు నిర్వాహకులు పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్, ట్రాఫిక్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముందే అవసరమైన అనుమతులు, నిరభ్యంతర పత్రాలు పొందడంతో పాటు మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యులు, బాధ్యత వహించే వ్యక్తుల వివరాలను పోలీసులకు అందజేయాలని సూచించారు. రహదారులు, పాదచారుల మార్గాలకు ఆటంకం కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయరాదని, అత్యవసర వాహనాలకు మార్గం నిరోధించకూడదని స్పష్టం చేశారు. విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రధాన మండపాల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు స్వచ్ఛంద సేవకులను ఏర్పాటు చేసి, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విరాళాలను స్వచ్ఛందంగా మాత్రమే స్వీకరించాలని, ఎవరిపైనా ఒత్తిడి చేయరాదన్నారు. శబ్దవర్ధకాలు, ధ్వని పరికరాలను అనుమతులు, నిర్ణీత సమయాలు, శబ్ద పరిమితులకు లోబడి వినియోగించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. ఇతర మతాలు, కులాలు, వర్గాలు లేదా వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసే నినాదాలు, బ్యానర్లు, పోస్టర్లు, ప్రసంగాలు చేయరాదని, మద్యం, మత్తు పదార్థాలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావివ్వరాదని హెచ్చరించారు. వివాదాలు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయరాదన్నారు. నిమజ్జనం సందర్భంగా పోలీసుల అనుమతితో నిర్ణయించిన మార్గంలోనే ఊరేగింపు నిర్వహించాలని, అనుమతించిన వాహనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. వాహనాలపై పరిమితికి మించి భక్తులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రమాదకరంగా వేలాడటం, విన్యాసాలు చేయడం వంటి చర్యలను అనుమతించరాదన్నారు. అధికారులు నిర్ణయించిన నిమజ్జన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, భక్తులు లోతైన నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులను నీటి ప్రాంతాలకు దూరంగా ఉంచడంతో పాటు తగిన వెలుతురు, ప్రాణరక్షణ పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిమజ్జనం అనంతరం మండపాలు, ప్రచార బోర్డులు, విద్యుత్ ఏర్పాట్లను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు భక్తి, ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా ప్రతి ఉత్సవ కమిటీ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

## సన్నవడ్ల బోనస్ కొరకు ఆన్లైన్ నమోదు తప్పనిసరి

- మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్



**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన 7 సన్న వరి రకాలను వానాకాలం --2026 లో సాగు చేస్తున్న రైతులు క్వింటాల్ కు 500/- బోనస్ పొందేందుకు తమ సాగు వివరాలను ముందస్తుగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు. విత్తనాలు డీలర్ వద్ద కొనుగోలు చేసిన రైతులు పూర్తి వివరాలతో విత్తన డీలర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని, సీడ్ ప్లాంట్స్ యూనివర్సిటీ వ్యవసాయ పరిశోధన కేంద్రాలలి నుండి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఒక దరఖాస్తు ఫారంతో పాటు విత్తనాల కొనుగోలు బిల్లు, పట్టా పాస్బుక్, ఆధార్ జిరాక్స్ ప్రతులు జతచేసి సంబంధిత ఏ ఈ ఓకి సమర్పించాలనీ, తమ స్వంత వడ్లను విత్తనాలుగా వినియోగించిన రైతులు కూడా దరఖాస్తు ఫారం,పట్టా పాస్బుక్ , ఆధార్ జిరాక్స్ ప్రతులను ఏ ఈ ఓ కి సమర్పించాలని కోరారు. ఆన్‌లైన్‌లో సాగు వివరాలు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వానాకాలం--2026 సన్న వడ్ల బోనస్ పొందేందుకు అర్హత ఉంటుంది కనుక రైతులు తమ సాగు వివరాలను ఈనెల 8వ తేదీ లోపు కచ్చితంగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

## సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడంపై బీజేపీ నిరసనలు



- జిల్లావ్యాప్తంగా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు
- సీఎం దిష్టిబొమ్మ దహనం, పలువురు నేతల అరెస్ట్

**కరీంనగర్, సెప్టెంబర్3(సింగిడి):** నల్గొండలోని బీజేపీ కార్యాలయం, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశాయని, కార్యాలయంలోని సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్ల సిరా చల్లడాన్ని నిరసిస్తూ గురువారం కరీంనగర్ జిల్లావ్యాప్తంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. మండల కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. చొప్పదండిలో జరిగిన నిరసనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొని మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపించారు. నల్గొండలో వర్షిత్‌రెడ్డి నివాసంపై దాడి చేసి ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు ఆయన తల్లిపై దాడి చేశారని, ఆమె అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడం దళిత సమాజంతో పాటు అన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. చిత్రపటాన్ని అవమానించిన వారిపై సమగ్ర విచారణ జరిపి, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని, నిందితులను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా వెంటనే అరెస్ట్ చేయాలని సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును అరెస్ట్ చేయడాన్ని కూడా ఆయన ఖండించారు.

**తిమ్మాపూర్‌లో దిష్టిబొమ్మ దహనం..** తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, చింతం శ్రీనివాస్, ఎలుకపెల్లి స్వామి, బొంతల కళ్యాణ్‌చంద్ర, బుట్ల శ్రీనివాస్, ముద్వరపు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీఐటీలో శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ



**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (సింగిడి):** జమ్మికుంటలోని బీసీఐటీ కార్తికేయ ఐటీఐ కళాశాలలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆరు నెలలు, మూడు నెలల పాటు శిక్షణ పొందిన విద్యార్థినులకు ఈ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బీసీఐటీ చైర్మన్ లెంకలపెల్లి శరత్ కుమార్ మాట్లాడుతూ.. బీసీఐటీలో శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థినులు ప్రస్తుతం స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తుండటం ఎంతో గర్వకారణంగా, సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు తమకు అందిన శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. కుట్టుమిషన్ శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వం అందించే వివిధ రకాల రుణాలు, ఉపాధి పథకాలకు అర్హత పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థినులు తమ అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం బీసీ విద్యార్థులకు కుట్టుమిషన్లు అందించే కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో, బీసీఐటీలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు ఆ సర్టిఫికెట్ ఆధారంగా కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని శరత్ కుమార్ తెలిపారు. అదేవిధంగా బీసీఐటీలో ఉచిత కుట్టుమిషన్ బ్యూటిషియన్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉచిత శిక్షణ ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని స్వయం ఉపాధి పొందేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు.

## బిజెపి ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం



**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (సింగిడి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలం తో కాంగ్రెస్ నాయకులు నల్గొండ జిల్లా బిజెపి కార్యాలయం పై దాడి చేసి దళిత నాయకుడు సంతు రామదాసు చిత్రపటంపై రంగు చల్లినందుకు నిరసనగా బిజెపి దళిత మోర్చా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసినట్లు బిజెపి జమ్మికుంట మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్ తెలిపారు. గురువారం జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామం లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి దళిత మోర్చా ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బిజెపి నాయకులు దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అత్యుత్సాహంతో కాంగ్రెస్ నేతలు బిజెపి దళిత నేతపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. బిజెపి నీతులు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు రోడ్లమీద తిరగరని ఇప్పటికైనా ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, సంపెల్లి సంపత్ రావు, పుల్లూరు ఈశ్వర్, కేవిడి కుమార్ స్వామి, గరికంటి శ్రీధర్, గాజుల తిరుపతి, భీమిర కిషన్ రావు, గిరవేనా ఐలయ్య, పుట్టాల మల్లేష్, దొంగల రవి, రెంటాల మహేందర్, గుడ్ల రాజకుమార్, శెట్టి హరీష్, రేపెల్లి తిరుపతి, కొట్టాల వెంకటేష్, శంకర్, శివ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, సెప్టెంబర్3(సింగిడి):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణ, వర్షపు నీటి నిల్వలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, పారిశుధ్య పర్యవేక్షకులు, పారిశుధ్య తనిఖీ అధికారులు, జవాన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఇళ్ల చుట్టుపక్కల, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ప్రతి డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి నీరు నిల్వ కాకుండా మట్టి లేదా మొరం నింపడం, కలుపు మొక్కలు, చెత్త తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇళ్ల పరిసరాలు, నిర్మాణ ప్రాంతాలు, సెల్లార్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూలకుండీలు, నీటి తొట్టెలు, ట్యాంకులు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, డ్రైనేజీలు, నాలాలు, కల్వర్టుల్లో చెత్త, పూడికను తొలగించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో లార్వా నివారణ మందుల పిచికారీ, పొగమందు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే పారిశుధ్య ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు డివిజన్‌వారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, చేపట్టిన పనుల వివరాలను ప్రతిరోజూ సమర్పించాలని ఆదేశించారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో పనిచేసి నీటి నిల్వలు, చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలు పొంగిపొర్లడం వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్లు సువార్త, ఎన్. డి. అయాజ్, సహాయ కమిషనర్ రాజమనోహర్, పారిశుధ్య పర్యవేక్షకుడు శ్యామ్‌రాజ్, పశువైద్యాధికారి దుర్గాప్రసాద్, పర్యావరణ ఇంజినీర్లు స్వామి, రమేష్, పారిశుధ్య తనిఖీ అధికారులు, జవాన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి రోజుల విజయోత్సవ ర్యాలీలు

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన ప్రజలు
ప్రభుత్వ సంక్షేమ పథకాలే రేపటి విజయానికి నాంది
హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ సుహాసిని






**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తైన సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఘనంగా విజయోత్సవ సంబురాలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. పీసీసీ,డీసీసీ, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలతో పట్టణ మండల ప్రధాన కూడళ్లలో భారీర్యాలీ నిర్వహించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన అనంతరం తెలంగాణ ప్రజలు కోరి తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రతివర్గానికి న్యాయం చేస్తున్నామని,పదేళ్లు అధికారంలో బీఆర్ఎస్ చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే చూసి ఓర్చుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే మరిన్ని సంక్షేమ పథకాలను జనాలకు అందజేసిందని అన్నారు. 1000 రోజుల ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీలు హుజురాబాద్ లో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి 500 మందితో అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి,బాణాసంచా కాల్చి,కేక్ కట్ చేశారు. అనంతరం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని హుజూరాబాద్ అభివృద్ధికి ఇక్కడ ఇంచార్జి గా ఉన్న ప్రణవ్ బాబు నిత్యం మంత్రులతో,అధికారులతో మాట్లాడి నిధులు తీసుకొస్తున్నారని,ఇక్కడ ప్రజల ఓట్లతో గెలిచి వారి అభివృద్ధిని పట్టించుకోకుండా కౌశిక్ రెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా మారాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. హుజూరాబాద్ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ,ప్రణవ్ బాబుకే సాధ్యమని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కౌశిక్ రెడ్డి 1000 రోజుల్లో హుజూరాబాద్ కి సున్నా నిధులు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్ పర్సన్అంజలి,కౌన్సిలర్లు,జిల్లా అధికార ప్రతినిధులు, జనరల్ సెక్రటరీలు,మహిళ నాయకురాళ్లు,మండల పట్టణ నాయకులు, సేవాదళ్,మైనారిటీ, యువజన, యూత్, ఎన్ఎస్యూఐ,సోషల్ మీడియా, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**జమ్మికుంటలో....** జమ్మికుంట పట్టణంలో 1000 రోజుల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పరశురామారావు,పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో కోరపల్లి గ్రామం నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీచౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో ప్రజలకు దగ్గరయ్యే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని వాటి ద్వారా ప్రజలకు మరింతగా ప్రభుత్వం ప్రజలకు దగ్గరగా అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న,వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి డైరెక్టర్లు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు మాచర్ల రాజు ఒగ్గు రమేష్ చందారాజు దిద్ది రాము పాతకాల మౌనిక అనిల్ ,సర్పంచులు,ఉప సర్పంచులు,మహిళ పట్టణ,మండల అధ్యక్షురాల్లు,మండల,పట్టణ కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్



**జమ్మికుంట,సెప్టెంబర్ 3 (సింగిడి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు రెండువేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. లిలి"కాంగ్రెస్ బాకీ కార్డు"లిలిను ప్రజలకు పంపిణీ చేస్తూ అమలు కాని హామీలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దేవాలయాల్లో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందజేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పి నేడు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. "100 రోజుల్లో అమలు" అంటూ ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, యూరియా కొరత, రైతు సంక్షేమ పథకాల నిర్లక్ష్యం, సాగునీటి విషయంలో ప్రభుత్వ వైఫల్యం రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచాయని అన్నారు. రైతు భరోసా, రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ వంటి హామీలు అమలు కాక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. అలాగే మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి కీలక హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని పేర్కొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, ముసిపట్ల తిరుపతి రెడ్డి, మాడ సదావ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ కామిడి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిపల్లి మహిపాల్ రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, కాసర్ల సుధాకర్, జక్కు నారాయణ, ముత్యాల శంకర్, నాగిడి సంజీవ రెడ్డి, కాంతారెడ్డి మధుసూదన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అడిగొప్పుల సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్
లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీల అందజేత




**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని విడతలవారీగా ఇండ్లలు కేటాయిస్తుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. గురువారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తన కార్యాలయంలో ప్రొసిడింగ్ కాపీలను స్థానిక కౌన్సిలర్ తో కలిసి అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం వారికి ఇండ్లను కేటాయిస్తుందని ఇందులో ఎలాంటి పైరవీలకు తావు లేదని అర్హులైన లబ్ధిదారులను అధికారులు గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం జరుగుతుందని దీనికోసం లబ్ధిదారులు ఎవరు కూడా ఎలాంటి డబ్బులు ఎవరికి చెల్లించాల్సిన అవసరం లేదని సూచించారు. న్యాయంగా అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇండ్లను కేటాయిస్తుందని స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని మీకు 24 గంటలు అందుబాటులో ఉంటానని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కొలుగూరి సురంజన్,చింతల శ్రీనివాస్, కొలుగూరి సురేష్,ఫిరోజ్,పోనగంటి విష్ణు,లక్ష్మణ్, రమేష్,జానీ తదితరులు పాల్గొన్నారు.

## సర్ 2 ప్రక్రియను పరిశీలించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (సింగిడి) :** హుజూరాబాద్ నియోజకవర్గం లో సర్ 2 ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించడానికి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గురువారం వీణవంక మండలం కొండపాక గ్రామంలో 197,198 బూత్ లలో నోటీసులు వచ్చిన వారి ఇండ్లకు బిఎల్ఏ ,బిఎల్ వో లతో కలిసి వెళ్లి వారితో మాట్లాడి సంబంధిత ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ శాతం నోటీసులు వచ్చినవారిలో 2002 లో ఓటు వేసిన దానికి వాళ్ళ వారసుల వయస్సు తేడా వచ్చినవారున్నారని తండ్రి పేరు ఇంటి పేరులో తేడా ఉన్నవాళ్ళు 2002 ఓటర్ లిస్టు మ్యాపింగ్ కు సంబంధించి సరియయిన సమాచారం ఇవ్వని వాళ్ళు ఉన్నారని అన్నింటికీ దగ్గరుండి ఆధారాలు సేకరించి తుది జాబితాలో వీరందరి ఓట్లు నమోదు అయ్యే విధంగా పని చేయాలని బిఎల్ఏ లకు నరేందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఈఆర్వో కోఆర్డినేటర్ మొలుగూరి సదయ్య, సయాబ్ హుస్సేన్,మహమ్మద్ సజ్జు,బిఎల్ఎ లు రామకృష్ణ, శ్రీనివాస్, కొండపాక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల సమరభేరి!

కొల్లాపూర్, సెప్టెంబర్ 3 (సింగిడి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక సర్పాపూర్ శాసనసభ్యురాలు శ్రీమతి వాకిటి సునీతా లక్ష్మారెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా, అటు రైతులను ఇటు ప్రజలను పూర్తిస్థాయిలో మోసం చేసిందని కొడిపల్లి బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు సారా రామా గౌడ్ అన్నారు . రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, యూరియా--ఎరువుల కొరత, వరి కొనుగోళ్లు, సాగునీటి సమస్యలు తదితర రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఈ ధర్నా చేపట్టారు. అనంతరం మంత్రివర్యులు హరీష్ రావు మాట్లాడుతూ... హామీలన్నీ గాలికి వదిలి రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల సమయంలో వంద రోజుల్లో రైతుకు ఎకరాకు రూ. 15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు గడుస్తున్నా హామీల అమలుకు దిక్కులేకుండా చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శించారు. రైతుబంధు రూ. 15 వేలు చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. అక్కాచెల్లెమ్మలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మా... రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థి భరోసా కార్డులు, ఆడపిల్లల స్కూటీల హామీలు ఎక్కడికి పోయాయని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రైతు మరణిస్తే కుటుంబానికి రూ. 5 లక్షల భరోసా ఇచ్చిన రైతుబీమా గొప్ప పథకమన్నారు. కరోనా, నోట్ల రద్దు వంటి సంక్షోభాల్లోనూ రైతుబంధు ఆగలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్



హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలు, లో వోల్టేజ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రైతుబంధు లేదు, రైతుబీమాపై స్పష్టత లేదు, కరెంటు సక్రమంగా లేదని విమర్శించారు. మరోవైపు యూరియా, డీఏపీ వంటి ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోందన్నారు. ఎరువుల ధరలు పెరిగి రైతులపై పెట్టుబడి భారం అధికమైందన్నారు. యాప్‌ల పేరుతో ఎరువుల కోసం రైతులను కార్యాలయాలు, దుకాణాల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. శివంపేట, రామాయంపేట, దుబ్బాక, మాసాయిపేట ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు ఆందోళనలు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

## పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ

- అర్హత సాధించిన వారికి డేస్ స్కాలర్ క్లాసులు
- 6న ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిక పరీక్షలు
- యువత సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్ 3 (సింగిడి): పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న భూపాలపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు జిల్లా పోలీస్ శాఖ మరో మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. పోలీస్ ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని అర్హులైన అభ్యర్థులకు ఉచిత డేస్ స్కాలర్ శిక్షణ తరగతులతో పాటు గ్రౌండ్ కోచింగ్ అందించేందుకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన యువతీ యువకులకు ఈ నెల 6వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు భూపాలపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో శారీరక, రాత పరీక్షలు నిర్వహించనున్నారు.

**అర్హత సాధించిన వారికి ఉచిత శిక్షణ**
శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత డేస్ స్కాలర్ తరగతులతో పాటు గ్రౌండ్ కోచింగ్ అందించనున్నట్లు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు.

**స్థానిక అభ్యర్థులకే అవకాశం**
శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు భూపాలపల్లి జిల్లా స్థానికులై ఉండాలి. సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు.

**అభ్యర్థులు తీసుకురావాల్సిన ధ్రువపత్రాలు**
రెసిడెన్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసిన అప్లికేషన్ ఫామ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో'... ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ... శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత డేస్ స్కాలర్ శిక్షణ తరగతులు, గ్రౌండ్ కోచింగ్ అందిస్తామని తెలిపారు. జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. ఉద్యోగం ద్వారా తమ బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుకోవాలని సూచించారు.

### సాగర్ జలాలతో వాయిలసింగారం

## చెరువును నింపాలి

**ప్రత్యేక తూము ఏర్పాటు చేసి నీటిని మళ్లించాలి**

**బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్**



కోదాడ, సెప్టెంబర్ 3 (సింగిడి): అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలోని ఊర చెరువును నాగార్జునసాగర్ కుడి కాలువ నీటితో నింపాలని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కంటు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని, నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ,సాగర్ కాలువ నుంచి చెరువులోకి నీటిని మళ్లించేందుకు ప్రత్యేకంగా తూము ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా సాగర్ జలాలు చెరువులోకి రాకపోవడంతో నీటి వనరు క్రమంగా తగ్గిపోతోందని తెలిపారు. చెరువును సాగర్ జలాలతో నింపితే వాయిలసింగారంతో పాటు చుట్టుపక్కల ఐదు, ఆరు గ్రామాల రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. చెరువులో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్టాలు మెరుగుపడతాయని, రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. అదేవిధంగా చెరువుపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభించడంతో పాటు పశువులు, పక్షులకు నీటి వసతి అందుబాటులో ఉంటుందని తెలిపారు. వేసవిలో గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు కూడా చెరువు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి తూము నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, సాగర్ కాలువ నుంచి నీటిని చెరువుకు మళ్లించేలా ప్రతిపాదనలు రూపొందించి పనులు త్వరగా ప్రారంభించాలని కంటు శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

## 5న నకిరేకల్‌లో ముఖ్యమంత్రి పర్యటన

**జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ , సెప్టెంబర్ 3 (సింగిడి): ఈనెల 5 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, నకిరేకల్ లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనకు హాజరుకానున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి . చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల ఐదున నల్గొండ జిల్లా, నకిరేకల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారని, ఏరియా ఆసుపత్రి ప్రారంభం తర్వాత బహిరంగ సభకు వస్తారని, అక్కడే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆయా శాఖల ద్వారా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి జిల్లాలోని గౌరవ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని డిఆర్ఓ ను ఆదేశించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, స్టేజి డయాస్ ,కుర్చీలు, తాగునీరు, టెంట్లు, పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తు, బహిరంగ సభ నిర్వహించే స్టేడియం చుట్టు పక్కల శానిటేషన్ నిర్వహించాలని, పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, మున్సిపల్ రోడ్లు, పంచాయతీ రోడ్లు, గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు .అలాగే హెలిప్యాడ్ వద్ద పరిశుభ్రతతో పాటు, డబుల్ బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కవరేజ్ కి అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్ల వంటి ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్ఓ దశరథ్,జిల్లా అధికారులు హాజరయ్యారు.

## పుష్కరాల లోపు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- కాళేశ్వరం దేవస్థానంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకపూజలు
- ఫైర్ స్టేషన్ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేయండి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





మహాదేవపూర్,సెప్టెంబర్ 3 (సింగిడి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర దేవస్థానం పునర్నిర్మాణ పనులను గోదావరి పుష్కరాల లోపు పూర్తి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశించారు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించి ఆయన అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, గోదావరి పుష్కరాలు నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు పూర్తి కావడానికి అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతినెల పూర్తి చేయాల్సిన పనులకు సంబంధించిన స్పష్టమైన లక్ష్యాలు, టైం లైన్ రూపొందించుకొని వాటి ప్రకారం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం జాప్యం చోర్ చేసుకోకుండా సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని, దేవాలయ నిర్మాణ పనులు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణంలో నాణ్యమైన కృష్ణ శిలలను తెప్పించి అవసరమైన కార్వింగ్ పనులు చేపడుతున్నట్లు, రాతి పనులను వేగవంతం చేసేందుకు ముగ్గురు కాంట్రాక్టర్లతో పనులు కొనసాగించాలని సివిల్ నిర్మాణ పనులను కూడా సమాంతరంగా వేగవంతం చేయాలని అన్నారు. ఆలయ చారిత్రక ప్రాధాన్యత నిర్మాణ నాణ్యత భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పనిని ఒకటి బాగుందిగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి, ఇరిగేషన్, దేవాలయ అధికారులు, కాంట్రాక్టర్లు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని పనుల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**కాళేశ్వరం ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు**
కాళేశ్వర దేవస్థానం పునర్నిర్మాణ పనులను పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆదిముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బాలలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు అర్చకులు జిల్లా కలెక్టర్కు వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాన్ని శేష వస్త్రాలను అందజేశారు.

**ఫైర్ స్టేషన్ తహసిల్ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయండి**
మహదేవపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మితమైన ఫైర్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయాల ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వర దేవస్థాన పునర్నిర్మాణ పనులను పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ తిరుగు ప్రయాణంలో మహదేవపూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్, తాసిల్దార్ కార్యాలయాలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మౌలిక వసతులు, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫైర్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ అత్యవసర సమయాల్లో ఫైర్ ఇంజన్లు విపత్తు నిర్వహణ వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా పార్కింగ్ ప్రాంగణం అణువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో ఆర్ అండ్ బి ఎస్ ఈ రమేష్, పి ఆర్ఈఈ విద్యాసాగర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఈవో మహేష్, సివిల్, స్టోన్ వర్క్ కాంట్రాక్టర్లు, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఫైర్ స్టేషన్ అధికారి నాగరాజు, డిప్యూటీ తాసిల్దార్ యూసుఫ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో సైబర్ మోసాలకు చెక్!



- 'బీ సైబర్ స్మార్ట్' పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ సంకీర్త్
- అపరిచిత లింకులు, క్యూఆర్ కోడ్‌లతో జాగ్రత్త
- మోసపోతే వెంటనే 1930కు ఫోన్

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో సెప్టెంబర్ 3 (సింగిడి): గణేష్ ఉత్సవాల వేళ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆవిష్కరించారు. గణేష్ ఉత్సవాల సమయంలో ప్రజల రద్దీ, ఆన్‌లైన్ లావాదేవీలు పెరగడంతో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. గుర్తుతెలియని లింకులు, క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేయడం, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు వంటి కీలక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు సైబర్ భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సంకీర్త్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఎస్సై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివకుమార్‌తో పాటు సైబర్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాబోయేది వైయస్సార్ యుగమే


- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



నల్లగొండ ప్రతినిధి సెప్టెంబర్ 3 (సింగిడి): రాబోయేది మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి యువమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రా జశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సం దర్భంగా నార్కట్‌పల్లి మండలం స్వగ్రామమైన బ్రాహ్మణ వెల్లంల లో వైయస్సార్ విగ్రహానికి మును గోడు ఎమ్మెల్యే పూలమాల వేసి నివా ళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నాడు పేదలకు అండగా వైఎస్సార్ పేద ప్రజలకుఎలా అండగా నిలవాలో దేశానికి చూ పించిన నాయకుడు వైఎస్ రా జశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. పేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారంటే అం దుకు వైఎస్సార్ తీసుకొచ్చిన ఆ రోగ్య పథకాలే కారణమని అన్నా రు.రైతులకు ఉచిత విద్యుత్ అం దించిన ఘనత వైఎస్సార్‌దేనని, పేదలు, రైతుల కోసం ఆయన అ మలు చేసిన అనేక సంక్షేమ పథ కాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థా నాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు.నల్లగొండ ప్రాంతాన్ని కరువు, ఫ్లో రైడ్ సమస్యల నుంచి బయటప డేలా చేయాలనే లక్ష్యంతో ఉద య సముద్రం ప్రాజెక్టును తీసుకొ చ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కు తుందని అన్నా రు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన లో ఈ ప్రాజెక్టుపై సరైన శ్రద్ధ చూ పలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి రై తులకు సాగునీరు అందించామ ని తెలిపారు. వై ఎస్సార్ మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడిగా ఉన్నారని, తాము కూడా అదే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నామని అన్నారు.అయితే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఇతర పా ర్టీల నుంచి నాయకులను ఆహ్వానించడం మంచిదేనని, కానీ కొత్తగా వచ్చిన వారి కోసం తమ ఇం ట్లోనే ఉన్న వారిని బయటకు పం పే ప్రయత్నాలు చేస్తే మాత్రం ఊ రుకునేది లేదని కీలక వ్యాఖ్యలు చేశారు.రాహుల్ గాం ధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ని మరింత బలోపేతం చేసి, నల్ల గొండ ప్రాంతాన్ని అభివృద్ధి పథం లో మరింత ముందుకు తీసుకెళ్తా మని ఆయన అన్నారు. వైఎస్సా ర్ వర్ధంతి సందర్భంగా బ్రాహ్మణ వెల్లంలలో జరిగిన ఈ కార్యక్ర మం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సా హాన్ని నింపింది. అయితే రాజగో పాల్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్య లు మాత్రం స్థానిక కాంగ్రెస్ రాజకీ యాల్లో చర్చనీయాంశంగా మా రాయి. ఈ కార్యక్రమంలోమునుగోడు, నల్లగొండ, నకిరేకల్, నియోజకవర్గాల కాంగ్రెస్ వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సంక్షేమ పాలన చిరస్మరణీయం

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు. దాట్ల శ్రీనివాస్**



భూపాలపల్లి, సెప్టెంబర్ 3 (సింగిడి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై. ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కరుణాకర్.. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ, 108/104 సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, పావలా వడ్డీ రుణాల వంటి పథకాల ద్వారా వైఎస్సార్ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. వైఎస్సార్ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు భారీగా పాల్గొని నివాళులర్పించారు.

## అధికార దాహంతోనే బీఆర్ఎస్ విమర్శలు

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



హనుమకొండ, సెప్టెంబర్ 3 (సింగిడి): అధికార దాహంతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య మండిపడ్డారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకటరామిరెడ్డి కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు గుర్తుకు రాకపోగా ఇప్పుడు అధికారం కోల్పోయిన రెండుమూడేళ్లకే ఓపిక నశిస్తోందనీ ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రెండున్నరేళ్లలోనే తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చిందని ఎంపీ తెలిపారు. విద్యార్థి ఏడాది చదువుకున్న తర్వాత తన ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను చూసుకున్నట్లే.. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు తాము చేసిన పనులే ప్రోగ్రెస్ రిపోర్ట్ అన్నారు. మేము నోటి మాటగా చెప్పడం లేదనీ గణాంకాలతో సహా ప్రజల ముందుంచామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనకు తేడాను ప్రజలే గమనిస్తున్నారనీ ఆమె తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల భారంలోకి నెట్టి వెళ్లినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని ఆపకుండా, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివనీ అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులను ఉపయోగించుకుని సుమారు 1200 మందికి పైగా విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల నియామకాలు చేపట్టడంతో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు పాఠశాలలు ఉండటం మాత్రమే కాకుండా నాణ్యమైన బోధన అందించేందుకు తగినంత మంది ఉపాధ్యాయులు ఉండాలని ప్రభుత్వం భావించిందన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా సుమారు రూ. 60 వేల కోట్ల రుణాలు అందించినట్లు ఆమె తెలిపారు. పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు తదితర రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులుగా తీర్చిదిద్దే దిశగా కూడా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఎన్నో హామీలు ఇచ్చినా.. అనేక ప్రాంతాల్లో ఇళ్లు అసంపూర్తిగా వదిలేసిందని ఎంపీ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే తొలిదశలో 4.5 లక్షల ఇంది రమ్మ ఇళ్లను మంజూరు చేసింది అని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ పక్షపాతం లేదని స్పష్టం చేశారు. అర్హత ఆధారంగా కలెక్టర్ల పర్యవేక్షణలో ఎంపిక జరుగుతోందని, కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు దక్కాలనే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు రాజకీయ అనుభవం ఉందని, ఆయన నిర్మాణాత్మక విమర్శలు చేస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని కావ్య అన్నారు. "కేసీఆర్ గారికి అనుభవం ఉంది. అభివృద్ధికి ఉపయోగపడే సూచనలు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తారనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే ప్రజల అవసరాలకు అను గుణంగా కొత్త కార్యక్రమాలను కూడా చేపడుతోందని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసి చూపించిందన్నారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై. ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు హన్మకొండలోని డీసీసీ కార్యాలయంలో జరిగాయి. సందర్భంగా వరంగల్ ఎంపి డా.కడియం కావ్య దివంగత వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


## రైతుల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి వైయస్సార్

**మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి**



నలగొండ ప్రతినిధి సెప్టెంబర్ 3 (సింగిడి): పేద ప్రజల మన్ననలు పొందిన మహోన్నత వ్యక్తి వైయస్సార్ నల్లగొండ మాజీ జడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నల్గొండలోని శ్రీనగర్ కాలనీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్ఆర్ అని ఆయన అన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అని ఆయన కొన్ని ఆడారు. ఈ కార్యక్రమంలో వంగూరి లక్ష్మయ్య, కార్పొరేటర్ ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్ మందడి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కోటి, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ సభ్యుడు పాదం అనిల్, మాజీ కౌన్సిలర్ ఖయ్యూం బేగ్, ఏదుల్ల మధుసూదన్ రెడ్డి, తాజుద్దీన్, పిల్లి యాదగిరి యాదవ్, బిక్షం గౌడ్, రామకృష్ణ, కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చింత యాదగిరి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# లివర్‌లో పేరుకుపోయిన కొవ్వును కరిగించాలంటే...



మన కాలేయ కణాలలో కొవ్వు పేరుకుపోయినప్పుడు, ఆ పరిస్థితిని ఫ్యాటీ లివర్ అంటారు. ఈ రోజుల్లో ఫ్యాటీ లివర్ సమస్య వేగంగా పెరుగుతోంది. చాలా మంది యువత కూడా ఫ్యాటీ లివర్ బారిన పడుతున్నారు. ఆరోగ్య నిపుణుల ప్రకారం, ఇప్పుడు పిల్లలు కూడా ఫ్యాటీ లివర్ సమస్య బారిన పడుతున్నారు. సరైన జీవనశైలి లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మద్యపానం కారణంగా ఫ్యాటీ లివర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.కాలేయం గ్లూకోజ్‌ను శక్తిగా మారుస్తుంది. అయితే, ఏదైనా కారణం చేత గ్లూకోజ్ శక్తిగా మారనప్పుడు, అది కొవ్వుగా పేరుకుపోతుంది. ఈ కొవ్వు కాలేయంలో అధికంగా పేరుకుపోయినప్పుడు, దానిని ఫ్యాటీ లివర్ వ్యాధి అంటారు.

ఈ రోజుల్లో చాలా మంది ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారు. అయితే, ఫ్యాటీ లివర్ సమస్యను రివర్స్ చేయొచ్చా? అంటే అవును అని సమాధానం ఇస్తున్నారు డాక్టర్ రమాకాంత్ రెడ్డి .మీ అల్ట్రాసౌండ్ రిపోర్టులో 'ఫ్యాటీ లివర్' (దీనిని ఇప్పుడు వైద్య పరిభాషలో MASLD అని పిలుస్తున్నారు) అని రాగానే భయపడాల్సిన పనిలేదు, అలాగని నిర్లక్ష్యం కూడా చేయకూడదు. ముఖ్యంగా కాలేయానికి ఇంకా ఎటువంటి గాట్లు లేదా మచ్చలు పడకముందే గుర్తిస్తే, దీనిని పూర్తిగా సాధారణ స్థితికి తీసుకురావచ్చు. దీని కోసం మార్కెట్లో దొరికే ప్రత్యేక 'డిటాక్స్ డ్రింక్స్' లేదా మ్యాజిక్ మందులు ఏవీ అవసరం లేదు. శరీర మెటబాలిజంను సరిదిద్దుకోవడం, క్రమంగా బరువు తగ్గించుకోవడమే దీనికి అసలైన పరిష్కారం. డాక్టర్లు ప్రతి రోగికీ సూచించే 8 ముఖ్యమైన అంశాలేంటో ఇప్పుడు ఓ లుక్కేద్దాం. 'ఫ్యాటీ లివర్' అనేది కాలేయంలో కొవ్వు చేరిందని చెప్పే ప్రాథమిక వివరణ మాత్రమే. అసలు ప్రశ్న ఏంటంటే, కాలేయంపై మచ్చలు లేదా వాపు (ఖఅఎతీశీంఱం) ఏర్పడిందా లేదా అనేది. కేవలం కొవ్వు మాత్రమే ఉన్న వ్యక్తికి, కాలేయం దెబ్బతిని మచ్చలు ఏర్పడిన వ్యక్తికి అల్ట్రాసౌండ్‌లో ఒకేలా కనిపించవచ్చు. కానీ వారి ఆరోగ్య సమస్య తీవ్రత వేరుగా ఉంటుంది. కాబట్టి కాలేయ పనితీరు, ఫైబ్రోసిస్ స్థాయిని తెలుసుకోవడానికి డాక్టర్‌ను సంప్రదించాలి.

2. అందరూ 'ఐడియల్ వెయిట్' చేరుకోవాల్సిన అవసరం లేదు
స్వల్పంగా బరువు తగ్గినా లివర్‌కు ఎంతో మేలు జరుగుతుంది.

3-5% బరువు తగ్గితే: కాలేయంలోని కొవ్వు కరగడం మొదలవుతుంది.
7% లేదా అంతకంటే ఎక్కువ తగ్గితే: కాలేయంలోని వాపు తగ్గుతుంది.
10% లేదా అంతకంటే ఎక్కువ తగ్గితే: ఒకవేళ ఫైబ్రోసిస్ (మచ్చలు) ఉన్నా అది మెరుగవుతుంది.
(ఉదాహరణకు, మీరు 80 కేజీలు ఉంటే, కనీసం 4 కేజీలు తగ్గినా కాలేయంపై స్పష్టమైన మార్పు కనిపిస్తుంది).

3. కేవలం బరువు తగ్గడమే ముఖ్యం కాదు , వ్యాయామం కీలకం
శరీర బరువులో పెద్దగా మార్పు రాకపోయినా, రోజూ వ్యాయామం చేయడం వల్ల కాలేయంలోని కొవ్వు తగ్గుతుంది.

వారానికి కనీసం 150 నిమిషాల వేగవంతమైన నడక, సైక్లింగ్ లేదా స్విమ్మింగ్ చేయాలి.
ఈ సమయాన్ని కేవలం వీకెండ్‌లో కాకుండా వారంలో 5 రోజులకు విభజించండి.
వారానికి 2-3 రోజులు కండరాల బలం పెంచే తేలికపాటి స్ట్రెంత్ ట్రైనింగ్ చేర్చండి.
రోజూ క్రమం తప్పకుండా చేయగలిగే నడక వంటి వ్యాయామం అన్నింటికంటే ఉత్తమం.

4. ఫ్యాటీ లివర్‌కు ప్రత్యేకమైన డైట్ ఏమీ లేదు
తక్షణమే బరువు తగ్గే కఠినమైన డైట్లకు బదులు బ్యాలెన్స్‌డ్ ఆహారం అలవాటు చేసుకోండి.

ఎక్కువగా తీసుకోవాల్సినవి : తాజా కూరగాయలు, సీజనల్ పండ్లు, పప్పుధాన్యాలు, నట్స్, గింజలు, తృణధాన్యాలు, చేపలు, ఆలివ్ ఆయిల్ వంటి మంచి కొవ్వులు, తగినంత ప్రోటీన్.
తగ్గించాల్సినవి: కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన పండ్ల రసాలు, స్వీట్లు, మైదా, బేకరీ వస్తువులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, నూనెలో వేయించిన పదార్థాలు, రెడ్ మీట్.

5. "నేను నూనె తక్కువగానే తింటాను కదా" --- సమస్య నూనె ఒక్కటే కాదు
చాలామంది నూనెలు, నెయ్యి ఎక్కువగా తినడం వల్లే ఫ్యాటీ లివర్ వస్తుందని అనుకుంటారు. కానీ అసలు సమస్య అధిక కేలరీలు, పంచదార, మైదా, పొట్ట చుట్టూ చేరే కొవ్వు. దీర్ఘకాలం పాటు కొనసాగించగలిగే సమతుల్య ఆహారమే కాలేయానికి రక్షణ.

6. తగ్గిన బరువు మళ్లీ పెరగకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యం
ఇది 2-3 నెలలు చేసి ఆపేసే డైట్ ప్లాన్ కాదు. జీవనశైలి మార్పు. బరువు తగ్గి, మళ్లీ పాత అలవాట్లలోకి వెళ్లి బరువు పెరిగితే, కాలేయంలో కొవ్వు కూడా అంతే వేగంగా తిరిగి చేరుతుంది. మళ్లీ సమస్య తిరిగి మొదటికే వస్తుంది.

7. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ కూడా చెక్ చేసుకోండి
ఫ్యాటీ లివర్ కేవలం కాలేయానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది డయాబెటిస్, హై బీపీ, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులతో ముడిపడి ఉంటుంది. వీటిలో ఒకదానిని నియంత్రణలో ఉంచితే మిగిలినవి కూడా మెరుగవుతాయి.

8. కొన్ని సందర్భాల్లో బరువు తగ్గే మందులు అవసరం కావచ్చు
విపరీతమైన ఊబకాయం లేదా డయాబెటిస్ ఉన్న రోగులకు బరువు తగ్గించడంలో సహాయపడే ఆధునిక మందులను వైద్యులు సూచించవచ్చు. ఇది అందరికీ వర్తించదు. డాక్టర్ పూర్తి పరీక్షలు చేసిన తర్వాతే నిర్ణయిస్తారు.




# సుభాష్ చంద్ర రూ.22000 కోట్ల మాఫీ ఎఫెక్ట్

ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర పూచీకత్తు ఇచ్చిన రూ. 22 వేల కోట్లకు పైగా అప్పులో రూ. 6.5 కోట్లు చెల్లించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలపడం తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసింది. ఈ వ్యవహారం తర్వాత జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు భారీగా పడిపోతున్నాయి. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఒక్కరోజే 14 శాతం మేర కుప్పకూలాయి. గత మూడు సెషన్లలో ఈ షేర్లు 17 శాతం మేర పతనమయ్యాయి. మరి అందకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం....స్టాక్ మార్కెట్లో జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఎస్సెల్ గ్రూప్ అధినేత సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియలో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన 99.97 శాతం హెయిర్‌కట్ తీర్పు వివాదా స్పదంగా మారడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. రూ. 22 వేల కోట్లకు గాను కేవలం రూ. 6.5 కోట్లు చెల్లించేందుకు ఆమోదం లభించడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొని ఈ స్టాక్ ఇవాళఒక్కరోజే 14 శాతం మేర కుప్పకూలింది. కంపెనీ లెక్కలతో నేరుగా సంబంధం లేకపోయినా ఈ వార్తలు మార్కెట్ సెంటి మెంట్‌ను దెబ్బతీశాయని చెప్పవచ్చు.ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్రకు చెందిన మీడియా కంపెనీ అయిన జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్ ప్రైజెస్ షేర్లు ఈరోజు భారీగా పడిపోయాయి. ఆగస్టు 31వ తేదీ సోమవారం నాటి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో జీ షేరు ధర 14 శాతం మేర క్షీణించి రూ. 86.90 వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. ఆ తర్వాత కాస్త కోలుకున్నా నష్టాల్లోనే ట్రేడయింది. అలాగే గత నాలుగు ట్రేడింగ్ సెషన్లు గమనించినట్లయితే ఈ షేరు విలువ 17 శాతం మేర పడిపోయింది. దీంతో మూడు నెలల కనిష్ఠ స్థాయికి షేరు విలువ పడిపోయింది. నేషనల్ కంపెనీల లా ట్రిబ్యునల్ (చీజూ) ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ అప్పీల్‌కు వెళతామని ప్రకటిం చాయి. దీంతో ఇన్వెస్టర్లు ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రణాళిక ఆమోదం పొందడంతో పలువురు రుణదాతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ. 22,006.57 కోట్లకు గాను కేవలం రూ. 6.5 కోట్లు చెల్లించేలా ఉన్న దివాలా ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలపడంతో ఈ వివాదం రాజుకుంది. దీనిపై హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి రుణదాతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన కుటుంబంతో సంబంధం ఉన్న 5 ఆర్థిక సంస్థల ఓట్లతోనే దివాలా ప్రక్రియ ఆమోదం పొందినట్లు ఆరోపించాయి. దీంతో ఈ వ్యవహారంపై అప్పీల్‌కు వెళతామని ప్రకటించాయి. మరోవైపు.. ఈ రుణాలకు తాను వ్యక్తిగత హామీదారుగా మాత్రమే ఉన్నానని సుభాష్ చంద్ర తెలిపారు. అసలు క్లెయిమ్ రూ. 3,992 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. ఇప్పటికే పలు సంస్థలు రుణాలు చెల్లించాయని, మరింత రుణాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి.




## పసిడి ప్రియులకు అలర్ట్..
# భారీగా తగ్గి...

హైదరాబాద్‌లో లేటెస్ట్ రేట్లు ఇవే. బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఊరట. కిందటి వారం ఆఖర్లో గోల్డ్, సిల్వర్ రేట్లు భారీగా దిగొచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆగస్ట్ 31న కూడా ఉదయం అవే రేట్లు కొనసాగుతున్నాయి. అంటే పెరగకుండా, తగ్గకుండా స్థిరంగానే ఉన్నాయన్నమాట. ఇంటర్నేషనల్ మార్కెట్లో మాత్రం స్వల్పంగా దిగొస్తున్నాయి. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు మెట్రో నగరాల్లో గోల్డ్, సిల్వర్ రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం. అంతర్జాతీ యంగా గత నెల వ్యవధిలో బంగారం, వెండి ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఆగస్ట్ నెల ప్రారంభంలో భారీగా తగ్గిన ధరలు, తర్వాత 2 వారాల్లో భారీగా పెరిగాయి. అక్కడి నుంచి దాదాపు రూ. 20 వేల వరకు కూడా పెరిగింది. అయితే ఇక గత వారం చివర్లో గోల్డ్ రేటు రూ. 5 వేలకు పైగా పతనమైంది. వడ్డీ రేట్లను పెంచనున్నట్లు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ సంకేతాలు ఇవ్వడంతో బంగారం ఆకర్షణ కోల్పోయిందని చెప్పొచ్చు. ఇదిలా ఉండగా సోమవారం సెషన్‌లో (ఆగస్ట్ 31) గోల్డ్, సిల్వర్ రేట్లు పెద్దగా మారలేదు. ప్రస్తుతం దేశీయంగా స్థిరంగానే కొనసాగుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా స్వల్పంగా దిగొచ్చాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ప్రస్తుతం ఔన్సుకు 4440 డాలర్ల స్థాయికి తగ్గింది. సిల్వర్ రేటు 66 డాలర్ల స్థాయిలోనే ట్రేడవుతోంది. అంతకుముందు స్పాట్ గోల్డ్ ధర 4460 డాలర్ల స్థాయిలో ఉండేది. అక్కడి నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చింది. వారం కిందట ఇది 4650 డాలర్ల మార్కు దాటి ట్రేడవడం గమనార్హం.

దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో బంగారం, వెండి రేట్లు
దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే ముంబైలో 22 క్యారెట్ల పసిడి ధర ఆగస్ట్ 31న ఉదయం 7.30 గంటలకు తులం రూ. 1,45,050 వద్ద ఉంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన పుత్తడి ధర రూ. 1,58,240 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని దిల్లీలో 22, 24 క్యారెట్ల పసిడి, వెండి ధరలు వరుసగా రూ. 1,45,200; రూ. 1,58,390 వద్ద ఉన్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల గోల్డ్ జువెల్లరీ రేటు రూ. 1,45,050 వద్ద ఉంది. బెంగళూరు, కోల్‌కతాలోనూ ఇవే రేట్లు ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో గోల్డ్, సిల్వర్ రేట్లు
హైదరాబాద్‌లో ప్రస్తుతం సోమవారం ఉదయం 22 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములకు రూ. 1,45,050 వద్ద ఉండగా, 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర తులం రూ. 1,58,240 వద్ద ఉంది. ఇది ఆగస్ట్ 29న శనివారం రోజు వరుసగా రూ. 2650, రూ. 2890 మేర తగ్గింది. దానికి ముందు గురువారం రూ. 2850, రూ. 3110 మేర దిగొచ్చింది. ఇక్కడ వెండి ధర చూస్తే స్థిరంగానే ఉంది. హైదరాబాద్‌లో ఆగస్ట్ 31 ఉదయం కేజీ సిల్వర్ రేటు రూ. 2.60 లక్షల వద్ద ఉంది. ఆగస్ట్ 29న ఇది రూ. 5 వేల మేర తగ్గింది.ఏపీ ప్రధాన నగరాల్లో గోల్డ్, సిల్వర్ రేట్లు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా బంగారం, వెండి ధరలు ఏం మారలేదు. ప్రస్తుతం గుంటూరు, విశాఖపట్నం, అమరావతి, విజయవాడలో 22 క్యారెట్లు, 24 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 145050, రూ. 1,58,240 గా ఉన్నాయి.

**ఏయే అంశాలు ప్రభావితం చేస్తున్నాయి?**

సాధారణంగా అంతర్జాతీయ మార్కెట్ ధరలు దేశీయంగా వెంటనే ప్రభావం చూపిస్తుంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరగడం లేదా అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గడం వంటివి జరుగుతుంటాయి. ఇక యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు కూడా తక్షణ ప్రభావం చూపిస్తాయి. ఫెడ్ వడ్డీ రేట్లను పెంచితే డాలర్, బాండ్ ఈల్డ్స్ గిరాకీ పెరిగి బంగారం ధర తగ్గుతుంటుంది. వీటితో పాటు ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పెరగడం, తగ్గడం, ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాలు, ప్రభుత్వాలు విధించే సుంకాలు వంటివి కారణంగా ఉంటాయి.

## బుద్బూర్ లెఫ్ట్ కెనాల్‌లో పూడికతీత పనులు ప్రారంభం



**అమరచింత, (సింగిడి):** భూత్పూర్ లెఫ్ట్ కెనాల్ లో పూడిక తొలగింపు పనులు ష్మ భూత్పూర్ లెఫ్ట్ కెనాల్ పరిధిలోని ధర్మపూర్, మస్తీపూర్, అమరచింత, పిన్నంచర్ల గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కెనాల్ లో పూడిక తొలగింపు పనులు సోమవారం ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కెనాల్ లో భారీగా జమ్ము, పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి హిటాచీ ద్వారా పూడిక, జమ్ము తొలగింపు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసి వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముది రాజ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు టి. రవికాంత్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాడుగదిన్నె గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కోడేరు (సింగిడి):** కోడేరు మండల పరిధిలోని బాడుగదిన్నె గ్రామంలో సోమవారం నాడు గ్రామ సర్పంచ్ వెంకటస్వామి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జములయ్య కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు అర్హులందరికీ ప్రభుత్వం నుండి వచ్చే స్మార్ట్ రేషన్ కార్డులు అందరికీ అందజేస్తామని మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ జమ్మలయ్య అన్నారు ఈ కార్యక్రమంలో జిపిఓ చెన్నకేశవులు డీలర్ లోకేశ్వరి నరసింహ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## శెట్టిపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యేను కలిసిన మాజీ సర్పంచ్



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటుపై చర్చించారు. గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## భారత్-బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

**కోల్‌కతా, (సింగిడి):** భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ. 24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రాష్ట్రపతి భద్రతాధికారి రిషభ్ సింగ్ రాజీనామా

### -వ్యక్తిగత కారణాలతోనే అంటూ ప్రచారం

**న్యూఢిల్లీ, (సింగిడి):** రాష్ట్రపతి 'ఎయిడ్-డి-క్యాంప్ మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అనూహ్య రాజీనామా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ద్రౌపదీ ముర్మ అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారికి సోషల్ విడియాలో క్రేజ్ ఉంది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది. 12 ఏళ్లపాటు సైన్యంలో పని చేసిన రిషభ్ వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లు పేర్కొన్నారు. 32ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడవి లో చేరారు. మిలిటరీ స్టడీస్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అభ్యసించారు. '4 పారా స్పెషల్ ఫోర్సెస'లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత 'బలిదాన్ బ్యాడ్జ'ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా 'జాట్ రెజిమెంట' దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటిం జెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 2023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయన కెరీర్ కీలక మలుపు తిరిగింది. రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం, ప్రొటోకాల్‌ను అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష' అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## అదుపు తప్పి వాహనాలను ఢీకొన్న ట్రక్కు

### ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి

**న్యూఢిల్లీ, (సింగిడి):** నొయిడా జిల్లాలోని జేవార్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న ట్రక్కు.. కారు సహా పలు వాహనాలను ఢీకొనడంతో నలుగురు మృతిచెందారు. నొయిడాలోని జేవార్ సమీపంలో యమునా రహదారిపైన ఓ ట్రక్కు అతివేగంగా ప్రయాణిస్తోంది. ఇంతలో అదుపుతప్పిన ట్రక్కు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి వైపు రోడ్డువిదికి దూసుకెళ్లింది. అటువైపుగా వస్తున్న పలు వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు

### 70వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం



**దుబ్బాక, (సింగిడి):** భూంపల్లి: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాల్లో 70వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్బర్‌పేట్--భూంపల్లి, దుబ్బాక మండలాల స్థాయి క్రీడోత్సవాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మనకు ఎన్ని ఆస్తులు, సంపదలు ఉన్నా ఆరోగ్యం లేకపోతే వాటికి విలువ ఉండదన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం చేయడంతో పాటు వివిధ క్రీడల్లో పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలు, ఆటల వైపు ప్రోత్సహించాలని కోరారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు, సైకిల్ తొక్కడం వంటి శారీరక శ్రమ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం శారీరక శ్రమ తగ్గిపోవడంతో బీపీ, షుగర్ వంటి అనేక అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. చదువు ఎంత ముఖ్యమో విద్యార్థుల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పాఠశాలల్లో క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ విద్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి క్రీడా మైదానాలు, తరగతి గదులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, పీఈటీలు అందుబాటులో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై మరింత నమ్మకం, శ్రద్ధ చూపి తమ పిల్లలను క్రీడలు, సాంస్కృతిక మరియు ఇతర విద్యా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పాఠశాలలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు. పాఠశాలల్లోని చిన్నచిన్న సమస్యలను అందరూ కలిసి పరిష్కరించుకుంటే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. మండల స్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొంటున్న విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీపడి తమ ప్రతిభను చాటుకోవాలని, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి తమ పాఠశాలకు, తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు.

## చెరువు వద్ద దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

**నాచారం, (సింగిడి):** నాచారం సర్కిల్ హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ పెద్ద చెరువు ఇందిరానగర్ వైపు చెరువు కట్ట పక్కన గతంలో నిర్మించిన ట్రంక్ లైన్‌కు సంబంధించిన మ్యాన్‌హోల్స్ మూతలు చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకల కారణంగా పలు ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. కొన్ని మ్యాన్‌హోల్స్ పూర్తిగా కూలిపోవడంతో ఇందిరానగర్ ప్రాంతంలోని డ్రైనేజీ నీరు రివర్స్ వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. సమస్యను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోనల్ కమిషనర్ రాధిక గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను తక్షణమే పరిశీలించి, వాటిలో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు మ్యాన్‌హోల్ నిర్మాణాలను మరమ్మతు చేసి, ఇందిరానగర్‌లో డ్రైనేజీ రివర్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్యపై స్పందించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా జలమండలి ఈడీ పంకజతో మాట్లాడి మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులతో



పాటు అవసరమైన మరమ్మతులు తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు సాయి జెన్ శేఖర్ పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన లారీ

### మంటలు చెలరేగడంతో తప్పించుకున్న డ్రైవర్

**తిరుపతి, (సింగిడి):** చంద్రగిరి మండలంలోని బాకరాపేట ఘాట్ రోడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మహారాష్ట్ర నుంచి తిరుపతి వైపు వెళ్లే లారీ మార్గమధ్యంలో ప్రమాదవశాత్తూ కొండను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి అక్కడికక్కడే దగ్ధమైంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ త్రుటిలో తప్పించుకుని ప్రాణాలు నిలుపుకున్నారు. పైప్‌ల లోడ్‌తో ఓ లారీ మహారాష్ట్రలోని బరంపూర్ నుంచి తిరుపతి వైపు వెళ్తోంది. చంద్రగిరి సమీపంలోని బాకరా పేట ఘాట్ రోడ్డు వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తూ కొండగుట్టను ఢీకొట్టింది. దీంతో లారీ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ చాకచక్యంగా లారీ నుంచి బయటకు దూకారు. తర్వాత మంటలు వేగంగా వ్యాపించడంతో లారీ పూర్తిగా కాలిపోయింది. గమనించిన వాహనదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే లారీ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**దుబ్బాక, (సింగిడి):** చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన శ్రీ గడ్డం రాములు ఆత్మీయ అభినందన, సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య హాజరై, గడ్డం రాములు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతను అలవర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గడ్డం రాములు తన ఉద్యోగ జీవితంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతికి చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి మాత్రమే ముగింపు తప్ప, సమాజానికి సేవ చేయాలనే బాధ్యతకు ముగింపు కాదని చైర్మన్ పేర్కొన్నారు. గడ్డం రాములు తన సుదీర్ఘ అనుభవాన్ని భవిష్యత్తులో కూడా విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడే విధంగా అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గడ్డం రాములు సేవలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులు, సహ



చరులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. గడ్డం రాములు శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఆయన భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖాధికారి అంజా గౌడ్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ బాలకిషన్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీపీటీఎఫ్ ప్రతినిధులు, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం కోసం సునీత పాదయాత్ర

### -ప్రభుత్వం రోడ్లను విస్మరించిందని విమర్శ

**మెదక్, (సింగిడి):** మెదక్ జిల్లా వెల్దుర్తి నుంచి పిల్లికొట్టాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. సోమవారం ఉదయం నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు బయల్దేరారు. అక్కడ జిల్లా కలెక్టర్‌కు ఆమె వినతిపత్రం అందజేయనున్నారు. ఈ సందర్భంగా సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రావిణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెల్దుర్తి?పిల్లికొట్టాల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణాన్ని చేపట్టకుండా ఆ నిధులను రద్దు చేసిందని విమర్శించారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణం కోసం ప్రజల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రావిణ రోడ్లను పూర్తిగా విస్మరించిందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. వాటిని బీటీ రోడ్లుగా నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాదయాత్రకు మద్దతుగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమో మాట్లాడుతూ.. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు రద్దు చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హావినిచ్చిన ప్రభుత్వం గెలిచాక ప్రజలను మోసం చేసిందనన్నారు. ఇచ్చిన హావిలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాడుతుందన్నారు.

## కడ్తాల్ బోనాల ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ : సీఐకి ఆహ్వానం

**ఆమనగల్లు, (సింగిడి):** కడ్తాల్ పట్టణ కేంద్రంలో వచ్చే నెల 05వ తేదీ నుంచి 08వ తేదీ వరకు నిర్వహించనున్న 2026వ సంవత్సరం బోనాల ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కడ్తాల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ సైదులు రెడ్డి సబ్ ఇన్ స్పెక్టర్ గార్లకు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల తేదీలు, నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఉత్సవాల కరపత్రాలను అందజేస్తూ నాలుగు రోజులు జరిగే బోనాల ఉత్సవాలకు భారీ భద్రతను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కడ్తాల్ పట్టణ కేంద్రంలో బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తేదీలలో 05వ తేది శనివారం కాటమయ్య బోనాలు, 06వ తేది ఆదివారం బీరప్ప, పెద్దమ్మ, ఈదమ్మ, మడేలు స్వామి మరియు మైసమ్మ బోనాలు, 07వ తేది సోమవారం గ్రామ దేవత పోచమ్మ బోనాలు మరియు ఉత్సవాలు, 08వ తేది మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాలు జరుగుతాయని తెలిపారు. ఈ నాలుగు రోజుల పాటు వివిధ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ మరియు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మరియు మాజీ మండల పార్టీ అధ్యక్షులు బీచ్యా నాయక్, పట్టణ అధ్యక్షులు మాలే మల్లేష్ గౌడ్, రామచందర్ నాయక్, చేగురి రాములు తదితరులు ఉన్నారు.

## సీడ్ గణేశుడిని పూజించడం శ్రేష్టం

**హైదరాబాద్, (సింగిడి):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. ప్రకృతి సంరక్షణ, పచ్చదనం పెంపు కోసం ఈసారి అందరూ సీడ్ గణెళిశుడిని పూజించాలని కోరారు. మట్టి వినాయకుడిని పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణెళిశుడిని పూజించిన అనంతరం ఇంట్లోనే నిమజ్జనం చేస్తే.. అందులోని విత్తనం మొలకెత్తి మొక్కగా ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తుందని అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపొందించిన సీడ్ గణెళిశా ప్రతిమలను చిరంజీవి ఆదివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే కోట్లాది మొక్కలు నాటేలా ప్రజలను ప్రోత్సహిస్తున్న సంతోష్ కుమార్‌ను అభినందించారు. వినాయక చవితి సందర్భంగా పండుగ ఉత్సాహంతో పాటు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సీడ్ గణెళిశుడిని ఆరాధించడం ద్వారా అటు పుణ్యం.. ఇటు పురుషార్థం.. అంటే ప్రకృతిని కాపాడే బాధ్యత దక్కుతుంది' అని చిరంజీవి అన్నారు.

## నర్స్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**హైదరాబాద్, (సింగిడి):** తుక్కుగూడ నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నర్స్‌పై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. నిందితుడు సనావుల్లా కూడా అత్యాచారం చేసినట్టు అంగీకరించాడు. దీంతో పోలీసులు రేప్ సెక్షన్ కింద కేసును నమోదు చేయనున్నారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి శనివారం అనుమానాస్పద స్థితిలో మరణించిన విషయం తెలిసిందే. రాఖీ పండగ సందర్భంగా తోటి నర్సులందరూ స్వగ్రామాలకు వెళ్లగా.. హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న యువతి హత్యకు గురైంది. దీంతో పహాడీ షరీఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి.. ఆసుపత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పని చేస్తున్న సనావుల్లా ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. కిటికీ నుంచి నిందితుడు హాస్టల్‌లోకి ప్రవేశించినట్టు తెలుస్తోంది. అత్యాచారాన్ని నర్సు అడ్డుకోవడంతో.. సనావుల్లా ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# జీవో 99ను రద్దుచేసి రోస్టర్ విధానాన్ని సవరించాలి

### మాల మహానాడు ఆధ్వర్యంలో 'చలో సెక్రటేరియట్' ముట్టడి



**దుబ్బాక, (సింగిడి):** జాతీయ మాల మహానాడు పిలుపు మేరకు 'హలో మాల.. చలో సెక్రటేరియట్' కార్యక్రమంలో భాగంగా సోమవారం సెక్ర టేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రోస్టర్ విధానం వల్ల మాల నిరుద్యోగులు, విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని మాల మహానాడు నాయకులు ఆరోపిం చారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు నిర్వహి ంచిన ఈ కార్యక్రమంలో మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ నరేష్ మాట్లా డుతూ జీవో నంబర్ 99ను తక్షణమే రద్దు చేసి, రోస్టర్ విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాల నిరు ద్యోగులు, విద్యార్థులకు జరుగుతున్న అన్యా యాన్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలలు ఎంతో సేవ చేశారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మాల ఉద్యమకారులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించడం సరికాదని ఖండించారు. పోలీసుల చర్యలకు నిరసనగా మంగళవారం మాల ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర మాల మహానాడు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ శ్రీరాములు, దుబ్బాక అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కాల్వ లింగం, మాజీ అధ్యక్షులు ఆస ముత్యం, ఆస బక్కయ్య, బావాజీ రమేష్, ఆస రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో మత ప్రచారాలు చేపిస్తారా?

**అమాయక చిన్నారులతో మత మార్పిడిని ప్రోత్సహిస్తారా?**
**ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి తీవ్ర ఆగ్రహం**
**చిట్కుల్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఘటన**
**కలెక్టర్, ఉన్నతాధికారులకు తక్షణ విచారణ ఆదేశాలు**




**పటాన్చెరు, (సింగిడి):** ప్రభుత్వ బడుల్లో మత ప్రచారాలు ఎలా ప్రోత్సహిస్తారు? విద్యార్థినిల పుస్తకాలతో పాటు ఇతర మతాలకు చెందిన పుస్తకాలు పాఠశాలలోకి ఎలా అనుమతిస్తారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన సంగారెడ్డి జిల్లా చిట్కుల్ బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో పాఠశాలలో విద్యా సంస్థల నిబంధనలకు విరుద్ధంగా మత ప్రచారాలు, అనధికారిక కార్యకలాపాలు జరుగుతున్న విషయం ఆయన దృష్టికి రాగా... అధికారులపై మండిపడ్డారు.. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న వసతులు, విద్యాబోధన తీరు మరియు మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి రుచి, శుచిని స్వయంగా ఆరా తీశారు. ఈ తనిఖీ సమయంలో పాఠశాలలో ఇతర మతాలకు సంబంధించిన పుస్తకాలు పెద్ద ఎత్తున లభించడం, ప్రతి ఆదివారం ప్రత్యేక మందిరం ఏర్పాటు చేసి మతపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తించి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 28 ప్రకారం ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో, ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి మత ప్రచారాలు, ప్రార్థనలు నిర్వహించడానికి వీలేదని ఆయన స్పష్టం చేశారు. పవిత్రమైన విద్యా దేవాలయాలను ఇతర కార్యకలాపాలకు వేదికగా మారుస్తున్న తీరుపై మండిపడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి మత ప్రచారానికి పాల్పడిన సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బందిపై వెంటనే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ విజయేంద్ర జోషి, జోనల్ ఆఫీసర్ భీమయ్యలతో వెంటనే ఫోన్ లో మాట్లాడారు. పాఠశాలలో జరుగుతున్న అనధికార మతపరమైన కార్యకలాపాల వివరాలను వారికి వివరించి, తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై తగిన చర్యలు



తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని వసతుల కోసం యేటా ప్రతి విద్యార్థి మీద రూ. 1.8 లక్షల ఖర్చు చేస్తోందని ప్రభుత్వం కల్పిస్తోందని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టి పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు, నాయకులు సుభాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ "సమర భేరి"



**చేవెళ్ల, (సింగిడి):** ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజ లకు ఒరిగిందేమీ లేదని ఆరోపిస్తూ చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం నిరసన చేపట్టారు. హామీల అమలులో, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మండి పడ్డ నాయకులు.. హామీలను అమలు చేసి ప్రజలకు సమా ధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హామీల అమలుకు ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెద్దళ్ల ప్రభాకర్, కౌన్సిలర్స్,దూత మల్లేష్,డప్పు సువర్ణ చందు,కుర్వ మంగమ్మ మల్లేష్,సర్పంచులు,నరహరి రెడ్డి,నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి,నత్తి కృష్ణ రెడ్డి,దేశామొల్ల ఆంజనేయులు, దండు సత్యం, కరుణాకర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,శేరి రాజు,హనుమంత్ రెడ్డి,మాధవ్ గౌడ్,రాంప్రసాద్, బ్యాగరి సుదర్శన్,పృథ్వి,జంగారెడ్డి జహేద్, ప్రభాకర్ రెడ్డి,కడమంచి ఆనంద్,నరేందర్ రెడ్డి, మల్ల రెడ్డి,రామ గౌడ్,తలారి యాదయ్య, బేగరి మహేష్,కసిరే వెంకటేష్,తోట చంద్రశేఖర్, బ్యాగారీ నర్సింలు,చాకలి కృష్ణ,పాండు,వెంకటేష్, బొట్టు హనుమంత్ రెడ్డి, ముకుందం గౌడ్,మహేందర్ తదితర పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## నోటీసులందుకున్న ఓటర్ల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి



**రాజేంద్రనగర్, (సింగిడి):** నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా తక్షణ పరిష్కా రం చూపాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ, హైదర్షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన 'ఓటరు జాబితా నమోదు బస్తీ సభల'ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ప్రక్రియను, అధికారుల పనితీరును స్వయంగా పరిశీలించారు. మ్యాపింగ్ కాని వారికి, సవరణలు ఉన్న వారికి నోటీసులు సక్రమంగా అందుతున్నాయో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు పొందిన వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే ఓటరు జాబితా నమోదును నిర్ధారించాలని స్పష్టం చేశారు. బస్తీ సభల ప్రాంగణంలో ఓటర్లతో సీఈఓ నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ఒక్కరికీ నోటీసులు అందించి, పూర్తి ఆధారాలు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ?విచారణ ప్రక్రియ తనిఖీ: బస్తీ సభలలో అధికారులు ఓటర్ల దరఖాస్తులను విచారిస్తున్న విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ?ఈ తనిఖీ కార్యక్రమంలో సీఈఓ సుదర్శన్ రెడ్డితో పాటు రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాసరెడ్డి, ఏఈఆర్వో బి.సురేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ చేపట్టిన పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ..

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**
**వైఎస్సార్, జీడీ శ్రీనివాస్ గౌడ్ వర్ధంతుల సందర్భంగా మున్సిపల్, ఆశ వర్కర్స్ లకు చీరల పంపిణీ...**

**మల్కాజిగిరి, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం లో వైఎస్ఆర్ ముఖ్య మంత్రి చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 17వ వర్ధంతి, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీడి శ్రీనివాస్ గౌడ్ మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ గౌడ్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్‌జిత్ గౌడ్ ల ఆధ్వర్యంలో మల్కాజిగిరి లోని గాంధీ పార్క్‌లో మున్సిపల్ కార్మికులకు, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ పరిశీలకుడు షమీర్ కౌశల్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ లు పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్సార్ అందించిన సేవలను స్మరించుకు న్నారు. అదేవిధంగా మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభివృద్ధి కోసం జీడి శ్రీనివాస్ గౌడ్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆయన



ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు, కార్మిక వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ కుమార్, మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, మాజి కౌన్సిలర్ ఎస్ ఆర్ ప్రసాద్, జి ఎన్ వి సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, డివిజన్స్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, నూరి సత్య మూర్తి, పిట్ల నాగరాజు, ప్రవీణ్, శ్రీకాంత్, యూసుఫ్, రాఘవన్, లక్ష్మీ, బాబు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మహేందర్ గౌడ్,



గౌస్ భాయ్, కొండా గౌడ్, రవీందర్ రెడ్డి, నగేష్ గౌడ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, పార్థసారథి, సంజయ్, ఆశ, శారద, భూదేవి, ఇంద్ర, అసిమ్, రాజు, చారి అగోండా, కుమార్ గౌడ్, రవీందర్, వినయ్ నిరుగొండ, రాజేష్, లింగం, రామచందర్, వెంకన్న, సిరిగిరీ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయి

**కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు బి. శ్రీనివాస్ గౌడ్**

**చేవెళ్ళ(సింగిడి):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు, ప్రజా సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు చిరస్థాయిగా గుర్తుండిపోతా యని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బుధవారం చేవెళ్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్,టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం మాట్లాడుతూ.. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి సామాన్య ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. వైఎస్సార్ హయాంలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఉచిత విద్యుత్,



ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతర గతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలిగించారని పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి వైద్యాన్ని సామాన్యులకు చేరువ చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ప్రజా సంక్షేమ పాలన స్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు ఈ కార్యక్రమానికి టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, మండల పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,మాజీ చైర్మన్ సోలి పురం బలవంత్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశం, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ బక్క రెడ్డి రవీందర్ రెడ్డి, ఖదీర్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పడాల రాములు, కార్యదర్శులు గుండాల రాములు, మాణిక్యం, డైరెక్టర్ జనార్ధన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు బుచ్చిరెడ్డి, రామిరెడ్డి, శశిధర్ గౌడ్,మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, జహంగీర్, అనంతరాములు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్ గారి కార్తీక్ రెడ్డి, ఉప సర్పంచ్లు పాండు గౌడ్, విష్ణు గౌడ్, నాయకులు చంద్రయ్య, కిరణ్ గౌడ్, మల్ గారి బుచ్చిరెడ్డి, బేగారి శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్, శివ కుమార్ రెడ్డి, కరికే మల్లేష్, యాదయ్య, నర్సింలు, పామేనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## జర్నలిస్టుల కలానికి భద్రత కల్పించాలి

**మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి**



**జవహర్‌నగర్, (సింగిడి):** ప్రజల గొంతుకకు స్వేచ్ఛ, జర్నలిస్టుల కలానికి భద్రత, మీడియాలో సామాజిక ప్రాతినిధ్యం కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం నిర్వహిస్తున్న మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం బాలాజీనగర్ లోని అంబేద్కర్ మహనీయుల విగ్రహాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు అశోక్ మాదిగ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ మహంకాళి బిక్షపతి మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాలో దళిత జర్నలిస్ట్ పుల్ల రవీందర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు సామాజిక న్యాయం, వృత్తిపరమైన భద్రత, మీడియాలో సముచిత సామాజిక ప్రాతినిధ్యం కల్పించేందుకు ఫోరం చేస్తున్న పోరాటాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ బూడిద నరేందర్, అంబాల విష్ణు, అంబాల మల్లేష్ పాల్గొన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా ఎస్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రామ్ నాయక్ సంఘీభావం తెలిపారు.

## ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రప టాన్ని ఏర్పాటు చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత అని కొనియాడారు. ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రత్యేకంగా రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి సామాన్య ప్రజలకు ఎంతో చేరువయ్యారని నాయకులు పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించే విధంగా పలు పథకాలను అమలు చేసిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రజల కోసం చేసిన సేవలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివా ళులు అర్పించారు. కార్యక్రమంలో , సింగిల్ విండో డైరక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హామీలపై నిలదీస్తే మాపైనే దాడులా?

**జవహర్‌నగర్ బిఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ వర్గీయుల తోపులాట.**
**ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం.**
**జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య**
**బిఆర్ఎస్ మేడ్చల్ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి.**




**జవహర్ నగర్, (సింగిడి):** దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 33 నెలల్లోనే తెలంగాణ వ్యాప్తంగా ప్రజా వ్యతిరేకతతో రికార్డు కొట్టిందని హామీల అమలు పై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే కాంగ్రెస్ శ్రేణులు మాపై అకారణంగా దాడికి దిగడం తగదని తీవ్రస్థాయిలో మాజీ మేయర్ మేకల కావ్య ఖండించా రు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పోరుబాటలో పార్టీ పిలుపులో భాగంగా జవహర్ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ మేయర్ మేకల కావ్య పార్టీ అధ్యక్షుడు కొండలు ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. 420 హామీల ఎగవేత బ్యానర్లు ప్రదర్శిస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా బిఆర్ఎస్ శ్రేణులపైకి దూసుకొచ్చి బ్యానర్లు చించి వేయడం జరిగింది. దీంతో కొంత సేపు ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అకారణంగా మమ్ములను ఎందుకు అడ్డుకుంటున్నారని మాజీ మేయర్ ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పరచకుండా హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడుస్తున్న పథకాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను పచ్చని తెలంగాణలో మార్చితే రేవంత్ రెడ్డి ఆకలి కేకల తెలంగాణ గా మార్చాలని తెలిపారు. బిఆర్ఎస్ కార్యకర్తలు హామీలపై నిలదీస్తే పలకకపోవడం ఎందుకనీ ప్రశ్నించారు. బి ఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని ఎలాంటి కష్టం వచ్చినా వెన్నంటే ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం తగదన్నారు. అనంతరం ప్రజలకు 420 హామీలకు కార్డులను పంచుతూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్ పల్లపు రవి నాయకులు ప్రసాద్ గౌడ్ వెంకటేష్ గౌడ్ బాలరాజ్ సోమయ్య దిలీప్ అహ్మద్బాషా సాయి ప్రశాంత్ నవీన్ గౌడ్ ఎల్ల స్వామి అశోక్ విక్రమ్ భాస్కర్ శోభ రెడ్డి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ శ్రేణుల జోలికొస్తే ఊరుకోం... మహేందర్ రెడ్డి. మా కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుండే కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగడం దారుణమని చామకూర మహేందర్ రెడ్డి హెచ్చరించారు. హామీలను నిలదీస్తే ఎందుకంత కోపం 33 నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ రౌడీయిజం చేయాలని చూస్తూ ఊరుకోమని తగిన బుద్ధి చెప్తామన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజలకు వివరిస్తామని ప్రజలు కాంగ్రెస్ ను తిరస్కరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుల దాడులను నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. శ్రేణులకు అండగా ఉంటానని మహేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. త్వరలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని లెక్కలతో సహా చెల్లిస్తామన్నారు.

# వెయ్యి రోజులు పూర్తయినా హామీల అమలు ఎక్కడ?

## – తెలంగాణ రక్షణ సేన పార్టీ



**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** నారాయణపేట్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్ మండల కేంద్రానికి ఈ నెల 4 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో మద్దూర్‌లో విలేకరుల సమావేశం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు 1000 రోజులు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు నేటికి పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ, ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ప్రతి మండల కేంద్రంలో కాలేజీ, మద్దూర్ మండలానికి స్టేడియం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కూటీలు, తులం బంగారం, పెన్షన్ల పెంపు తదితర హామీలను ప్రజలకు ఇచ్చి, వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మద్దూర్ మండలానికి హామీ ఇచ్చిన స్టేడియం నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ డిమాండ్ చేసింది. అమర్‌గడ్డలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు సంబంధించిన పెచ్చులు ఊడిపోతున్నాయని, నిర్మాణ నాణ్యతపై అధికారులు వెంటనే పరిశీలన చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా గురుకుల హాస్టల్‌కు రహదారి నిర్మాణం విషయంలో ప్రజలకు నష్టం కలిగించే విధంగా సుమారు 100 ఇళ్లను తొలగించే పరిస్థితి రాకుండా, పోలీస్ స్టేషన్ ముందుగా ఉన్న మార్గం ద్వారా రహదారి నిర్మిస్తే తక్కువ నష్టంతో సమస్యను పరిష్కరించవచ్చని సూచించారు. రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో సుమారు 2, వేల కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ డిమాండ్ చేసింది. రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టర్ ఎవరైనా సరే, ప్రజాధనంతో నిర్మిస్తున్న రోడ్లు నాణ్యంగా, దీర్ఘకాలికంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీకి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించి, కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ ముఖ్యమంత్రిని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలి జనార్దన్, మద్దూర్ మండల పార్టీ అధ్యక్షులు మరికంటి రవికుమార్, కొత్తపల్లి మండల అధ్యక్షులు శివశంకర్, జిల్లా యువత అధ్యక్షులు మనోజ్ కుమార్ గౌడ్, జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు, అలాగే మాధవ్, నరేష్, మహిపాల్, నర్సింగ్‌రావు, ప్రసాద్, పాకిరప్ప, నర్సాపూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నందిపేట్ ఉజ్వల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి యోగాసన పోటీలు

**గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్, మెడల్స్ ప్రధానం**




**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** యోగా అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో నందిపేట్ లోని ఉజ్వల హైస్కూల్లో 17వ నిజామాబాద్ జిల్లా స్థాయి యోగాసన పోటీలను నిర్వహించారు. పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి దాదాపుగా 400 మంది క్రీడాకారులు పాలొన్నారు. ముఖ్యఅతిథులుగా డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్, సైనికు వెల్ఫేర్ ఆఫీసర్, టూరిజం డిపార్ట్మెంట్ ఆఫీసర్ పవన్ కుమార్, ఎస్జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం హాజరయ్యారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేశారు. నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగన్న మాట్లాడుతూ నందిపేట్ లో ఇలాంటి ఉన్నత స్థాయి యోగాసనా పోటీలు నిర్వహించడం తో సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలు కూడా నందిపేట్ లో నిర్వహించాలని, అందుకు మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యోగా సంఘం తరపున అబ్జర్వర్ గా విచ్చేసిన ఉప్పు రవీందర్, పోతనలు తెలంగాణ యోగా సంఘం నిర్వహించి కార్యకలాపాల గురించి వివరించారు. జిల్లా యువజన క్రీడా అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు యోగా ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలో కూడా రాణించాలని సూచించారు. నందిపేట్ మండలంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు ప్రభుత్వం తరపున కృషి చేస్తానని, నందిపేటలో క్రీడా ప్రాంగణం నిర్వహణకు నిధులు మంజూరు చేయడానికి చేరును తీసుకుంటా నని హామీ ఇచ్చారు. ట్రస్మా అధ్యక్షులు, ఉజ్వల స్కూల్ కరస్పాండెంట్ జి. అరుణ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యోగా పోటీలు మా పాఠశాలలో నిర్వహించడం గర్వంగా ఉందని, ఇంత మంచి అవకాశాన్ని మాకు కల్పించినందుకు యోగా సంఘానికి రుణపడి ఉంటామని భవిష్యత్తులో ఇలాంటి ఈ కార్యక్రమాని నిర్వహించడానికి మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. యోగా సంఘం అధ్య క్షురాలు డా. ఐశ్వర్య మాట్లాడుతూ తమ సంఘం చేసే పనుల గురించి వివరించారు. యోగా సంఘం ప్రధాన కార్యదర్శి గంగాధర్ ఈ పోటీలో గెలుపొం దిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ పోటీలో గెలుపొందిన మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

# కౌన్సిలర్ సమత కుమార్ మానవత్వానికి ప్రశంసల వెల్లువ

**అనాథ వృద్ధుడికి ఆపన్నహస్తం..**
**అనాధను ఆశ్రయంలో చేర్పించి**
**ఆశ నింపిన మానవత్వం**
**పదవి ప్రజల కోసం.. సేవ అపన్నుల కోసం**
**3 వ వార్డ్ కౌన్సిలర్ కందునూరి సమత కుమార్**





**సుల్తానాబాద్, (సింగిడి):** అండగా నిలిచే ఆపన్న హస్తం.. ఆదుకునే ఆత్మీయత.. అనాథ జీవితంలో ఆశనింపే మానవత్వం.. ఇవన్నీ కలిస్తే అది కందునూరి సమతా కుమార్ సేవాభావమే. పదవి అంటే కేవలం బాధ్యత కాదని. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడమే అసలైన ప్రజాసేవ అని నిరూపిస్తూ సుల్తానాబాద్ మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్ మరో మానవీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వార్డుకు చెందిన జంగ రాజయ్య అనే అనాథ, ఆశ్రయం లేని వృద్ధుడి పరిస్థితిని గుర్తించిన కౌన్సిలర్ సమతా కుమార్.. సమస్యను చూసి వెళ్లిపోకుండా తన వంతు బాధ్యతగా భావించారు. వృద్ధుడికి సురక్షితమైన జీవనం, ఆప్యాయత, సంరక్షణ అందేలా చొరవ తీసుకుని వృద్ధుల ఆశ్రమం లో చేర్పించారు. దీంతో దిక్కులేని వృద్ధుడి జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. పదవి ప్రజల కోసం.. సేవ ఆపన్నుల కోసం'... అన్నట్లుగా వ్యవహరించిన కౌన్సిలర్ సమతా కుమార్ చొరవ స్థానికంగా అభినందనలు అందుకుంటోంది. వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించడంతో తన బాధ్యత ముగిసిందని భావించకుండా.. అక్కడ అవసరమైన సంరక్షణ, సౌకర్యాలు అందుతున్నాయా అనే విషయంపై కూడా దృష్టి సారించడం ఆమె సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా సమతా కుమార్ మాట్లాడుతూ.. ఆశ్రయం లేని వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు కుటుంబం, సమాజం నుంచి ప్రేమ, ఆప్యాయత, భరోసా అందాల్సిన అవసరం ఉందన్నారు. మనం చేసే చిన్న సహాయం కూడా వారి జీవితాల్లో పెద్ద మార్పును తీసుకురాగలదని పేర్కొన్నారు. వృద్ధులు ఎవరికీ భారమేమీ కాదని.. వారు మన సమాజానికి అనుభవ సంపద అని సమతా కుమార్ అన్నారు. ఆపదలో ఉన్నవారిని గుర్తించి వారికి అండగా నిలిచే సంస్కృతి పెరగాలని ఆకాంక్షించారు.

తన వార్డులో ఎవరైనా నిరాశ్రయులు, అనాథలు, ఆపన్న స్థితిలో ఉన్న వృద్ధులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒక వృద్ధుడికి ఆశ్రయం కల్పించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదన్న సందేశాన్ని చాటుతూ.. కౌన్సిలర్ సమతా కుమార్ చూపిన మానవత్వం ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తోంది.

# కార్మిక హక్కుల పరిరక్షణకు సీఐటీయూ సమరభేరి

**రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి:**
**ఎరవెల్లి ముత్యంరావు**



**సుల్తానాబాద్, (సింగిడి):** కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు పిలుపునిచ్చారు. బుధవారం సుల్తానాబాద్‌లోని పూసల పెద్దమ్మ గుడి వద్ద రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు అక్టోబర్ 10, 11 తేదీల్లో తొలిసారిగా గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశాలకు సీఐటీయూ జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు 34 జిల్లాల నుంచి వివిధ రంగాల్లో పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, ఎన్నికల ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై కౌన్సిల్‌లో చర్చించి, భవిష్యత్ పోరాటకార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల విజయవంతానికి ఉద్యోగులు, కార్మికులు, అధికారులు, శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో రైస్‌మిల్ ఆపరేటర్స్ సంఘం అధ్యక్షుడు తాండ్ర అంజయ్య, సీఐటీయూ సుల్తానాబాద్ మండల కో-కన్వీనర్ మాతంగి రాజమల్లు, ప్రధాన కార్యదర్శి నౌవుండ్ల బ్రహ్మచారి, బండారి స్వామి, ఎల్లయ్య, రవీందర్, ఓదెలు, రమేష్, లచ్చయ్య, కుమార్, మల్లేష్, సతీష్, విలాస్, శీను, గోపి, శ్రీధర్, సుధాకర్‌రావు, తిలక్, మహేందర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నీరుకుల్లలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి

**మిస్మ్యాచింగ్ ఓటర్ల ఆధారాల**
**సేకరణకు ముగింపు**
**సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్**

**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిందని సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఓటరు వివరాల్లో తేడాలు ఉన్న వారి నుంచి అవసరమైన ఆధార పత్రాలను సేకరించి పరిశీలన ప్రక్రియను అధికారులు బుధవారం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ బషీరుద్దీన్, సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సునీత సాగర్, గ్రామ పంచాయతీ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సిబ్బంది సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగింది. దీంతో నీరుకుల్ల గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసిందని తెలిపారు. ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలకు సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



# వెయ్యి రోజులు.. హామీలు మాత్రం గాలిలో..!!

**కాంగ్రెస్ పాలనపై**
**బీజేపీ నేతల తీవ్ర విమర్శలు**

**గోదావరిఖని, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యా రాణి విమర్శించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జనగామ మండల బీజేపీ అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహిళలకు రూ. 2,500, రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లకు రూ. 5 లక్షలు, యువతకు విద్యా భరోసా, రూ. 4 వేల పింఛన్ వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రచారం ఎక్కువ..**
**ప్రజలకు ప్రయోజనం తక్కువ!**

పేదల సమస్యలు పరిష్కరించకుండా ఇళ్ల కూల్చివేతలు, దేవాలయాల తొలగింపు, చెట్ల నరికివేత వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని సంధ్యారాణి ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించాలని డిమాండ్ చేశారు.

**మోదీ పాలనే దేశానికి శ్రీరామరక్ష**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు నిరంతరం ప్రయోజనాలు అందుతున్నాయని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా హామీలను అమలు చేసి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సులువ లక్ష్మీ నరసయ్య, తడగొండ నరసయ్య, చిలుక భారతి, మచ్చ విశ్వాస్, బోడకుంటి సుభాష్, మెరుగు నరేష్ గౌడ్, ఊరగొండ అపర్ణ పాల్గొన్నారు.




# యూపీఎస్సీ లక్ష్యంగా అడుగులు వేయాలి..

**విజయం సాధించే వరకు శ్రమించాలి!**
**శారదనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆలయ ఫౌండేషన్**
**ఆధ్వర్యంలో యూపీఎస్సీ అవగాహన సదస్సు**
**విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలి:**
**రామగుండం, ఏసీపీ మడత రమేష్**




**గోదావరిఖని (సింగిడి):** యూపీఎస్సీ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు నిరంతర కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రామగుండం ఏసీపీ రమేష్ అన్నారు. శారదనగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు నిర్దిష్ట లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, కళాశాల అధ్యాపకుల సూచనలు పాటించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని తెలిపారు. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన ఆలయ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ మాట్లాడుతూ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నరహరి ఐఏఎస్ జీవిత ప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించారు. ఆయన ఆదర్శాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు స్ఫూర్తి నింపారు. ఆలయ ఫౌండేషన్ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, వాటి లక్ష్యాలను వివరించారు.

**యూపీఎస్సీకి ఎలా సిద్ధం కావాలి:** విజయానికి మార్గాలపై అవగాహన, రిసోర్స్ పర్సన్ అక్బరుద్దీన్ యూపీఎస్సీ పరీక్ష విధానం, ప్రిపరేషన్ ప్రణాళిక, చదువులో పాటించాల్సిన పద్ధతులు, విజయానికి అవసరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించడంతో పాటు, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే బాధ్యతను కూడా విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు.

**"ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం"**

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో యూపీఎస్సీ అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై అవగాహన పెంచడంతో పాటు, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా ప్రోత్సహిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**అతిథులకు ఘన సన్మానం.. విద్యార్థుల భారీ హాజరు**

కార్యక్రమం అనంతరం ముఖ్యఅతిథి ఏసీపీ రమేష్‌తో పాటు ఇతర అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ కోర్ కమిటీ సభ్యుడు మహేష్, డాక్టర్ జి. సుబ్బారావు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎఫ్ఆర్ఎస్ పనితీరు మెరుగుపర్చాలి

**కలెక్టర్ కె. హరిత**



**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):** : పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు పీజీఐ సూచికల్లో ఆశించిన ఫలితాలు సాధించేందుకు అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. బుధవారం కొమురం భీం ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల మోడల్ స్కూల్‌లో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి పాఠశాలలో నాణ్యత, సమానత్వం, ప్రాప్యత, జవాబుదారీతనం, ఆవిష్కరణ వంటి అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల అభ్యసన ఫలితాలను పెంచాలని సూచించారు.

**యూ-డైస్ ప్లస్ వివరాలు పక్కాగా**

యూ-డైస్ ప్లస్‌లో పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో, ఖచ్చితంగా నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని కలెక్టర్ తెలిపారు. డేటా నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆధార్ వివరాల నమోదు, ధ్రువీకరణ, అవసరమైన నవీకరణలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

**ఎఫ్ఆర్ఎస్ హాజరుపై ప్రత్యేక దృష్టి**

ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) హాజరును క్రమం తప్పకుండా, సక్రమంగా వినియోగించేలా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ పనితీరు మెరుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యంతోపాటు మానసిక, సామాజిక, శారీరక, సృజనాత్మక, నైతిక విలువలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్, విద్యార్థుల యూనిఫాంలు, సివిల్ వర్క్స్, పాఠశాలల సందర్శనలు, లీవ్ అకౌంట్ మేనేజ్‌మెంట్, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, ఖాన్ అకాడమీ, ఏఐ ఆధారిత అభ్యసన విధానాలపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలల పనితీరు మెరుగుదలకు నూతన, ఆవిష్కరణాత్మక విధానాలను అమలు చేయాలని సూచించారు. ప్లానింగ్ కో-ఆర్డినేటర్, క్వాలిటీ కో-ఆర్డినేటర్, ఏపీవో, ఏఎస్‌సీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# రాష్ట్రంలో రేవంత్ రామగుండంలో రాజ్ ఠాకూర్

**పేదల బతుకులు కూల్చుతున్నరు**
**420 మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిండ్రు**
**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
**కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమర శంఖారావం**



**గోదావరిఖని, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రామగుండంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి 'సమర శంఖారావం'గా నామకరణం చేశారు. రామగుండం కౌన్సిల్ కో-ఆర్డినేటర్ మేకల సమ్మయ్య యాదవ్ అధ్యక్షతన, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు 420 హామీలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందల రోజులు గడచినా ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో 'అభయహస్తం' పేరిట మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులకు రూ. 4,000 పింఛన్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, దళితులకు అంబేద్కర్ అభయ హస్తం వంటి హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని చందర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన రైతుబంధు, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను సైతం నిలిపివేశారని విమర్శించారు.

**రామగుండంలో అభివృద్ధి శూన్యం..**

రామగుండం నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని చందర్ ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి మాటాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నికల హామీలే ప్రధాన కారణమని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆరోపించారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక భరోసా, ఉద్యోగాల భర్తీ వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు న్యాయం చేయలేకపోయిందని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీల అమలును పక్కనపెట్టి మాజీ సీఎం కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని హరీష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మిరియాల రాజిరెడ్డి, నడిపెల్లి మురళీధర్‌రావు, మూల విజయారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాముల నారాయణ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మీ మహేందర్‌రెడ్డి, ధర్మాజీ కృష్ణ, సతీష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కోల సంతోష్, మహేష్, కర్క పద్మజ, రమేష్, కిషన్‌రెడ్డి, నటుపల్లి శ్రీనివాస్, ఈదునూరి శ్రీకాంత్, మచ్చ వేణు, జక్కుల తిరుపతి, నూతి తిరుపతి, మెతుకు దేవరాజ్, బొడ్డు రవీందర్, సాయి కుమార్ (చింటు) తదితరులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గుండె ఆగిపోతుంటే.. సీపీఆర్ తో ప్రాణం పోశారు..

**రోడ్డుపైనే ప్రాణాపాయం..వైద్యదంపతుల**
**చొరవతో ప్రాణదానం**





**మంచిర్యాల, (సింగిడి):** రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. క్షణాల్లోనే బైక్‌పై నుంచి కుప్పకూలిపోయాడు. చుట్టూ ఉన్నవారు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్న సమయంలో.. వెనుక కారులో వస్తున్న వైద్య దంపతులు పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా కారు ఆపి బాధితుడి వద్దకు చేరుకున్నారు. స్పందన లేకపోవడాన్ని గుర్తించిన వారు వెంటనే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) ప్రారంభించారు. కొద్దిసేపటి అనంతరం బాధితుడిలో కదలిక రావడంతో అక్కడున్న వారిలో ఆశలు చిగురించాయి. అనంతరం మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ మానవీయ ఘటన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గర్మిళ్ల ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికంగా లభించిన వివరాల ప్రకారం.. మల్లేష్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో అదుపు తప్పి రోడ్డుపై కుప్పకూలిపోయారు. అదే సమయంలో ఆయన వెనుక కారులో వెళ్తున్న వైద్య దంపతులు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, డాక్టర్ సునీత పరిస్థితిని గుర్తించారు.

**క్షణం ఆలస్యమైనా..**

గుండెపోటు వచ్చిన సమయంలో ప్రతి క్షణం ఎంతో విలువైనదే. బాధితుడి పరిస్థితిని గమనించిన వైద్య దంపతులు వెంటనే స్పందించి ప్రాథమికంగా పరిస్థితిని అంచనా వేశారు. మల్లేష్‌కు స్పందన లేకపోవడంతో ఆలస్యం చేయకుండా సీపీఆర్ నిర్వహించారు. గుండె స్పందన, శ్వాస పునరుద్ధరణకు అవసరమైన చర్యలను అక్కడికక్కడే చేపట్టారు. దీంతో పరిస్థితి విషమంగా ఉన్న మల్లేష్‌లో క్రమంగా స్పందన కనిపించింది. ఆ సమయంలో అక్కడున్న వారికి ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే వైద్య దంపతుల సకాలంలో స్పందనతో ప్రమాదం నుంచి మల్లేష్ బయటపడే అవకాశం లభించింది. అనంతరం ఆయనను తదుపరి వైద్యం కోసం తరలించేలా చర్యలు చేపట్టారు.

**సీపీఆర్.. ప్రాణానికి తొలి అండ..**

గుండెపోటు లేదా అకస్మాత్తుగా స్పందన కోల్పోయిన సందర్భాల్లో అత్యవసర వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ ప్రాణాలను కాపాడటంలో కీలకంగా మారుతుంది. ఇలాంటి సమయంలో బాధితుడి పరిస్థితిని గుర్తించి, శిక్షణ పొందిన వారు వెంటనే స్పందించడం ఎంతో అవసరం. గర్మిళ్లలో జరిగిన ఈ ఘటన సైతం అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పింది.

**అభినందనల వెల్లువ..**

ప్రాణాపాయ స్థితిలో ఉన్న మల్లేష్‌ను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, డాక్టర్ సునీత దంపతులను పలువురు అభినందించారు. సకాలంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. వైద్య వృత్తిలో ఉన్నవారు విధి వేళల్లోనే కాకుండా.. అవసరమైన సందర్భంలో ఎక్కడైనా మానవత్వంతో స్పందించాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేసిందని పేర్కొన్నారు. రోడ్డుపై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చూసి చాలామంది ఆందోళనకు గురై పక్కకు తప్పుకునే పరిస్థితుల్లో.. వైద్య దంపతులు తమ వాహనాన్ని ఆపి, బాధ్యతగా స్పందించడం పలువురిని ఆకట్టుకుంది. వారి చొరవ, వైద్య పరిజ్ఞానం, మానవత్వం కలగలిసి ఓ కుటుంబానికి ప్రాణాధారంగా నిలిచాయి. వైద్య దంపతులను పలువురు సన్మానించారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

**సంక్షేమ పథకాలతో కోట్లాది**
**కుటుంబాలకు భరోసా**
**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత**
**ఘనంగా వర్ధంతి వేడుకలు**






**సుల్తానాబాద్, (సింగిడి):** ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేసి కోట్లాది మంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వైఎస్సార్ వర్ధంతి వేడుకలను ఆమె ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పుష్పలత మాట్లాడుతూ.. పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర సేవలు, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి సామాన్యుడి జీవితంలో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని గుర్తుచేశారు. పేద కుటుంబాలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడం నుంచి రైతులకు అండగా నిలవడం వరకు వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలు ప్రజా జీవితాల్లో విశేష మార్పు తీసుకొచ్చాయని ఆమె అన్నారు. ప్రజల కోసం నిరంతరం ఆలోచించిన ఆయనను తరతరాలు స్మరించుకుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, కనుకుల సింగిల్ విండో చైర్మన్ చిలుక సతీష్, కాంగ్రెస్ నాయకులు సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, పన్నాల రాములు, కౌన్సిలర్లు సిద్ధ తిరుపతి, చింతల రాజు, టీకే ప్రభాకర్, గరిగే శ్రీనివాస్, గాదాసు రవి, పాల్గొన్నారు.

# లింకు తాకితే.. ఖాతా ఖాళీ!

**డీసీపీ భాస్కర్**

**మంచిర్యాల, (సింగిడి):** సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగరూకత దివస్‌లో భాగంగా బుధవారం మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకులు, సోషల్ మీడియా ఖాతాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రానున్న వినాయక చవితి, గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఆన్‌లైన్ విరాళాల పేరుతో జరిగే మోసాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నకిలీ లింకులు, ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు రూపొందించిన ప్రత్యేక సైబర్ అవగాహన పోస్టర్లను కార్యక్రమంలో విడుదల చేశారు. ఉత్సవాల సమయంలో ఆన్‌లైన్‌లో విరాళాలు లేదా ఇతర చెల్లింపులు చేసేటప్పుడు ఖాతా, వ్యక్తి వివరాలను ధ్రువీకరించుకున్న తర్వాతే డబ్బు పంపాలని సూచించారు. విద్యార్థులకు డిజిటల్ మోసాలు, పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి వారిలోనూ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ శ్రీనివాస్, ఆర్ఈ సంపత్, ఎస్ఐ మధుసూదన్, కళాశాల సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ పాలనలో ప్రజలకు
# వెయ్యి రోజుల గోస మిగిలింది
### రాష్ట్రంలో క్షిణించిన శాంతి భద్రతలు
### బి ఆర్ ఎస్ నేత ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఘాటు విమర్శలు



**వికారాబాద్ ప్రతినిధి,(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పండగ చేసుకోవడం విడ్డురంగా ఉన్నదని, రాష్ట్ర ప్రజలు వెయ్యి రోజులు అన్ని విధాలుగా గోస తీస్తున్నారని బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ పిలుపు మేరకు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వికారాబాద్ లో ఆర్ ఎస్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ పట్టణం లో బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, స్థానిక నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు అన్నివిధాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షిణించాయని ఆరోపించారు. ఇటీవల అమాయకురాలు గిరిజన బిడ్డను కామపిచాచి హత్యాచేయడం విషాదకరకమని అన్నారు. అదేవిధంగా సైకో షాబాద్ మండలంలో ఐదుగురుని పొట్టన పెట్టుకుంటే రాష్ట్ర హోం శాఖను నిర్వహిస్తున్న సీ ఎం ఘటన స్థలానికి చేరుకోలేదని బాదితుల అర్ధనాదాలను వినలేదని అన్నారు. పొక్సో కేసు నిందితుడికి కొమ్ముకాసి ఆరుగురు ప్రాణాలను బలితీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే హక్కు లేదని ఆయన అన్నారు. ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కు కూడా ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ఈలాంటి ఘటనలు రాష్ట్రంలో కోకొళ్ళలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సీ ఎం పసి పిల్లలు ముందు వళ్ళించిన మాటలతో వారు ఏలాంటి నీతి నేర్చుకుంటారని ఆయన అన్నారు. రాష్ట్రం లో గోరాలు జరుగుతున్నాయని అన్నారు. గతంలో తెలంగాణ అంటే సాగునిటీ ప్రాజెక్టులు, రైతు బంధు, టి హబ్బు, రెండు లక్షల పై చిలుకు ఉద్యోగాలు, లక్షాలాది విదేశీ కంపెనీల ఉద్యోగాలు అన్ని రంగాల అభివృద్ధి గుర్తుకు వచ్చేదని అన్నారు. జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలపై నాడు నేటి ఉప ముఖ్యమంత్రి బట్టి ఇచ్చిన మాటలు ఉట్టి మాటలుగా మారాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వికారాబాద్ కేంద్రంలో రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకుడు శుభప్రదపటేల్, నాయకులు గాయాజ్, గోపాల్, వేణు, రాజమల్లయ్య, ఆయా మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అశోక్, దయాకర్ రెడ్డి, ఫిరదోస్,వెంకట్ రెడ్డి, పురుషోత్తం, రాజు, వెంకట్ రెడ్డి, వీరగౌడ్,ప్రభాకర్ రెడ్డి, కామల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శంషాబాద్ మండల అభివృద్ధికి
# సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ (సింగిడి)::** మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మున్ని అధ్యక్షతన నిర్వహిం చిన మండల పరిషత్ 2వ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామా ల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభు సాగర్, డీఎల్పీవో , ఎంపీవో రమేష్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితాపై గ్రామ సభల పరిశీలన
## ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి సమీక్ష






**ఎల్బీ నగర్,(సింగిడి):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )ప్రక్రియలో భాగంగా సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, గ్రామ సభలను కందుకూరు ఆర్డీఓ ఎన్. జగదీశ్వర్ రెడ్డి మండల తహసీల్దార్ పి. వేణుగోపాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందా లేదా అనే విషయాన్ని ప్రజలు పరిశీలించుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు, మార్పులు లేదా చేర్పులు అవసరమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆర్డీఓ సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న వివరాలను స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులు, బూత్ స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జగదీశ్వర్ రెడ్డి సూచించారు. ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యాలయ సిబ్బంది, బీఎల్ఓలు తదితరులు ఆర్డీఓకు ప్రక్రియకు సంబంధించిన వివరాలను వివరించారు.

# చేవెళ్ల మండల వార్డు సభ్యుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక
### మండల అధ్యక్షునిగా సిహెచ్ శ్రీకాంత్...గౌరవ అధ్యక్షులుగా ఎండి నయూమ్ ఖాన్.

**చేవెళ్ల (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపకురాలు నాగవెల్లి జ్యోతి ఆదేశానుసారం రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి గ్యార సురేష్ జిల్లా కో ఇన్చార్జ్ దన్నే మల్లేష్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల వార్డు సభ్యుల ఫోరం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా ఆలూరు గ్రామ మొదటి వార్డు సభ్యుడు చెనిగేలా శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులు ఎండి నయూమ్ ఖాన్, ఉపాధ్యక్షులుగా పల్లని మహేందర్, విజయ్ కుమార్ కృష్ణమాచారి, అధికార ప్రతినిధి జిన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శి రాకేష్, మహేందర్, మండల కార్యదర్శి మల్లేష్ రవీందర్ సహాయ కార్యదర్శి టి మల్లేష్ సోషల్ మీడియా ఇన్చార్జ్ రమాదేవి రామకృష్ణ ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ... నూతన మండల వార్డు సభ్యుల ఫోరం కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డు సభ్యులకు 3000 గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. వార్డు సభ్యులకు భద్రత కార్డులు, మంజూరు చేయాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబ సభ్యులకు మూడు లక్షల ఎక్స్ గ్రేషియా అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు..



# సింగరేణి ఎగ్జిక్యూటివ్‌ల సమస్యలు పరిష్కరించాలి..
### ఈ నెల 12లోగా హామీలు అమలు చేయాలి
### లేనిపక్షంలో తదుపరి కార్యాచరణపై పునరాలోచిస్తాం.. సీఎంఓఏఐ-సింగరేణి బ్రాంచ్ హెచ్చరిక



**మణుగూరు,(సింగిడి):** సింగరేణి ఎగ్జిక్యూటివ్‌లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఈ నెల 12లోగా పరిష్కరించాలని సీఎంఓఏఐ--సింగరేణి బ్రాంచ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. జూలై 13న జరిగిన చర్చల్లో రెండు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని యాజమాన్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, ఉపాధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం ఇచ్చిన హామీపై విశ్వాసంతో, సంస్థలో పారిశ్రామిక శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని తదుపరి ఆందోళన కార్యక్రమాలను వాయిదా వేసినట్లు తెలిపారు. హామీ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ఇక జాప్యం చేయకుండా స్పష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

**- పే అప్‌గ్రేడేషన్‌కు ఆమోదమివ్వాలి..**

ఎగ్జిక్యూటివ్‌ల పే అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనకు అవసరమైన ఆమోద ప్రక్రియను వెంటనే పూర్తిచేసి రానున్న బోర్డు సమావేశంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే 2022--23, 2023--24, 2024--25 సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ బకాయిలను అర్హులైన ఎగ్జిక్యూటివ్‌లకు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంఓఏఐ--సింగరేణి బ్రాంచ్‌తో తక్షణమే స్ట్రక్చర్ సమావేశం నిర్వహించి మిగిలిన సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

**- హామీ నిలబెట్టుకోకపోతే కార్యాచరణ**

యాజమాన్యం ఇచ్చిన హామీని గౌరవిస్తుందనే నమ్మకంతోనే ఆందోళనలను వాయిదా వేశామని, సెప్టెంబర్ 12లోగా సమస్యల పరిష్కారంపై స్పష్టమైన చర్యలు కనిపించకపోతే తదుపరి కార్యాచరణపై పునరాలోచించాల్సి వస్తుందని అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. పరస్పర చర్చలు, అవగాహనతో సమస్యలను పరిష్కరించి ఎగ్జిక్యూటివ్‌లలో విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, ఉపాధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి
### బిజినపల్లి ఎంపీడీవో కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**బిజినపల్లి, (సింగిడి):** :అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తూ, పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి తెలిపారు. బిజినపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మునీరుద్దీన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కథలప్ప, ఉప తహసీల్దార్ రవికుమార్, మండల అధ్యక్షులు మిద్దె రాములు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటస్వామి, వట్టెం అమృత్‌రెడ్డి, బాలపీరు, మార్కెట్ కమిటీ సభ్యుడు నజీర్, శ్రీనివాస్‌గౌడ్, సైదులు, ఎద్దుల శ్రీకాంత్, సర్పంచ్ బాలస్వామి, గోవిందునాయక్, సర్పంచ్ మునిందర్‌నాయక్ తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### సర్ ప్రక్రియను పరిశీలించిన
## మహిళ కాంగ్రెస్ నాయకురాలు



**అల్వాల్,(సింగిడి):** వెంకటాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించిన మల్కాజ్గిరి ఏ బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వీనస్ మేరీ పరిశీలించారు. సర్ ప్రక్రియలో నోటీసు వచ్చిన ఓటర్లు సంబంధిత పత్రాలతోబి ఎల్ వో ల తో కలిసి అర్హులైన వారి ఓటర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ధృవీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాతనే నమోదు కార్యక్రమం చేపట్టామని ఆమె తెలిపారు.

### కొడంగల్ నుండి హైదరాబాద్‌కు
# ఎలక్ట్రికల్ బస్సు
### ప్రారంభించిన మున్సిపల్ ఛైర్మన్, కడ అధికారి




**కొడంగల్,(సింగిడి):** టిజి ఆర్టీసీ సంస్థ ద్వారా కొడంగల్ నుంచి హైదరాబాద్ కు ఎలక్ట్రానిక్ ఎక్స్ ప్రెస్ బస్సు ను బుధవారం కొడంగల్ లో ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్, కడ అధికారి వెంకట్ రెడ్డి లు జెండా ఊపి బస్సు ను ప్రారంభించారు. పెట్రోల్ డీజిల్ ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయనీ, పెట్రోల్ డీజిల్ ఖర్చులను నియంత్రించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఎలక్ట్రానిక్ బస్సు లను ప్రారంభి స్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈబస్సులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మెగావత్ శంకర్ నాయక్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కవితపై దుర్భాషలు మాట్లాడిన కానిస్టేబుల్ అనిల్‌పై చర్యలు తీసుకోవాలి



**మల్కాజిగిరి, (సింగిడి):** కల్వకుంట్ల కవిత పై అనుచితంగా, అవమానకరమైన పదజా లంతో మాట్లాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాని స్టేబుల్ అనిల్‌పై సంబంధిత అధికారులకు పిర్యా దు చేశారు. ప్రజా ప్రతినిధులు, ముఖ్యంగా మహిళల పట్ల అవమానకరమైన భాషను ఉపయోగించడం సమాజానికి ఏమాత్రం సమంజసం కాదు. ఈ ఘట నపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం టిఆర్ఎస్ మల్కాజిగిరి సీనియర్ నాయకులు కనగంటి నవీన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో సీఐ కి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి నియోజకవర్గ పార్లమెంట్ ఇంచార్జి వేముల భవాని పాల్గొని తమ మద్దతును తెలియజేషి మాట్లాడుతూ మహిళల గౌరవాన్ని కాపాడి,ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో టి ఆర్ ఎస్ మల్కాజిగిరి నాయకులు మద్దాలి సాయి కుమార్, సుమలత, సుధాకర్ శర్మ, పిట్ల విజయలక్ష్మి, జ్యోత్స్న అగుల్ల, పద్మజా, సందీప్, జాషువా, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# యాంటీబయాటిక్ యుగం వరకు పెన్సిలిన్ ఆవిష్కరణ పూర్వాపరాలు
## నేడు అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్‌ను కనుగొన్న దినం



1928 సెప్టెంబర్ 3న లండన్‌లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లో శాస్త్రవేత్త సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చేసిన ఒక సాధారణ పరిశీలన వైద్య చరిత్రను శాశ్వతంగా మార్చేసింది. బాక్టీరియాలజిస్ట్‌గా పనిచేస్తున్న ఆయన స్టాఫైలోకాకస్ అనే బాక్టీరియాపై ప్రయోగాలు కొనసాగిస్తుండగా కొన్ని పెట్రీ డిష్‌లు శుభ్రం చేయకుండా వదిలి పెట్ట బడ్డాయి. వాటిలో ఒకదానిపై పచ్చటి రంగు శిలీంద్రం పెరిగి, ఆ శిలీంద్రం చుట్టూ ఉన్న ప్రాంతంలోని బ్యాక్టీరియా పూర్తిగా నశించి పోయినట్లు ఆయన గమనించాడు. ఆ శిలీంద్రం పెనిసిలియం నోటాటమ్ అనే జాతికి చెందినదని, దానిలో నుంచి ఏదో పదార్థం వెలువడి బ్యాక్టీరియాను చంపేస్తుందని నిర్ధారించాడు. ఆ పదార్థానికే ఆయన పెన్సిలిన్ అని పేరు పెట్టాడు.

మానవ శరీరానికి హాని చేయకుండా ప్రమాదకర బాక్టీరియాలను మాత్రమే నశింపజేసే ఈ రసాయనం శాస్త్ర రంగానికి విప్లవాత్మక ఆవిష్కరణగా నిలిచింది.

ఫ్లెమింగ్ తన ఆవిష్కరణను 1929లో శాస్త్రీయ పత్రికలో ప్రకటించినప్పటికీ మొదట్లో పెద్దగా ప్రాధాన్యం పొందలేదు. పెన్సిలిన్‌ను శుద్ధి చేసి ఔషధంగా ఉపయోగించగల సాంకేతిక పరిజ్ఞానం ఆ సమయంలో ఆయన వద్ద లేదు. దాదాపు దశాబ్దం తర్వాత ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలోని హోవార్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ చైన్, నార్మన్ హీట్‌లీ తదితర శాస్త్రవేత్తలు పెన్సిలిన్‌పై విస్తృత పరిశోధనలు చేపట్టి, శుద్ధ రూపంలో ఉత్పత్తి చేయగలిగారు. 1939--40లోనే పెన్సిలిన్‌ను క్లినికల్ ట్రయల్స్‌లో విజయవంతంగా వినియోగించి, మానవ శరీరంలో వాడదగ్గ స్థాయికి అభివృద్ధి చేశారు.

రెండో ప్రపంచ యుద్ధం (1939--45) సమయంలో పెన్సిలిన్ ప్రాణ రక్షక ఔషధంగా నిలిచింది. యుద్ధ రంగంలో గాయపడిన సైనికుల చికిత్సకు దీన్ని విస్తృతంగా వినియోగించారు. యుద్ధ సమయంలో పెన్సిలిన్ వినియోగంతో లక్షలాది మంది సైనికుల ప్రాణాలు రక్షించ బడ్డాయి. 1943 నాటికి అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు కలిసి పెద్ద ఎత్తున పెన్సిలిన్ ఉత్పత్తిని ప్రారంభించాయి. 1944 నార్మండీ యుద్ధంలో మిత్ర దేశాల సైన్యానికి పెన్సిలిన్ ప్రధాన ఆయుధంగా పనిచేసింది. యుద్ధానంతరం సాధారణ పౌరులకు కూడా ఈ ఔషధం అందుబాటులోకి వచ్చి ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందింది.

**పెన్సిలిన్ ఆవిష్కరణకు ముందు చిన్న గాయాలే ప్రాణ హానికరమయ్యే పరిస్థితులు ఉండేవి. న్యుమోనియా, సెప్సిస్, గనేరియా, సిఫిలిస్, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల కారణంగా మరణాలు అధికంగా జరిగేవి. కానీ పెన్సిలిన్ అందుబాటులోకి రావడంతో అంటువ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. సర్జరీల తర్వాత వచ్చే ఇన్ఫెక్షన్లను నివారించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించింది. యాంటీబయోటిక్స్ యుగానికి నాంది పలికిన ఈ ఔషధం ఆధునిక వైద్యానికి మూల స్తంభంగా నిలిచింది.**

ఈ విప్లవాత్మక ఆవిష్కరణకు గుర్తింపుగా 1945లో సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్, హోవార్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ చైన్‌లకు వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయబడింది. పెన్సిలిన్ ఆవిష్కరణతో వైద్యరంగం మాత్రమే కాక మానవ జీవన విధానం కొత్త దశలోకి ప్రవేశించింది. 20వ శతాబ్దపు అత్యంత గొప్ప శాస్త్రీయ ఆవిష్కరణలలో పెన్సిలిన్ ఒకటిగా గుర్తించబడింది. 1928 సెప్టెంబర్ 3న జరిగిన ఆ యాదృచ్ఛిక పరిశీలన మానవాళికి కోట్లాది ప్రాణాలను కాపాడిన ప్రాణ దాయకమైన కానుకగా మారి చరిత్రలో శాశ్వత మైలురాయిగా నిలిచి పోయింది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్... 9440595494

# దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సీక్వెల్



మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'లక్కీ భాస్కర్'. ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి మనీ లాండరింగ్, హవాలా ద్వారా ఎలా కోటీశ్వరుడిగా మారారు? తనను స్కామ్‌లో ఇరికించాలనుకున్న వారినే ఎలా ఇరికించి దేశం దాటేశారు? అనేదే ప్రధానాంశంగా సినిమా రూపొందించారు. ఈ మూవీ క్లైమాక్స్‌లోనే సీక్వెల్ ఉంటుందనే హింట్ ఇచ్చారు. త్వరలోనే లక్కీ భాస్కర్ సీక్వెల్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. 'చాలా మంది లక్కీభాస్కర్ 2 ఎప్పుడు అని అడుగుతున్నారు. సీక్వెల్ మరింత పవర్ ఫుల్ స్టోరీతో రాబోతోంది.' అని చెప్పారు. దుల్కర్ సల్మాన్ సైతం లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం తాను కూడా వెయిట్ చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు తాను ఏ మూవీ ఈవెంట్స్‌కు వటటల్లినా లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం వెళ్లానని... ప్రతీ ఒక్కరికీ ఆ స్టోరీ బాగా కనెక్ట్ అయ్యిందని తెలిపారు. ఫస్ట్ పార్ట్‌లో 100 కోట్ల స్కామ్‌కు పాల్పడిన వ్యక్తిగా హర్షద్ మెహతా రోల్‌ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫేక్ బీఆర్స్‌తో బ్యాంక్ నగదును స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి భారీ కుంభకోణానికి పాల్పడిన తీరును చూపించారు. అయితే, ఆయన ఎవరు అనేది రివీల్ చేయలేదు. సీక్వెల్‌లో హర్షద్ మెహతా బ్యాగ్రౌండ్‌తో పాటు సీబీఐ ఎంక్వైరీ, భారీ స్కామ్ నుంచి తప్పించుకున్న లక్కీ భాస్కర్ మళ్లీ ఇండియాకి తిరిగివచ్చాడా? ఆ తర్వాత ఏం జరిగింది? అనేదే చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్‌లో సూపర్ హింట్ ఇస్తూనే సీక్వెల్ స్టోరీపైనా క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ పార్ట్‌లో దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించారు. సాయి కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించారు. సీక్వెల్‌లో మరిన్ని రోల్స్ యాడ్ కానున్నట్లు సమాచారం.

singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
4-9-2026





## 200కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'

ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.

## మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి

సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.

## సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా కనిపిస్తోంది

### రోమాంచకంపై మహేశ్ బాబు వ్యాఖ్యలు

యువ హీరో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటించిన లెటేస్ట్ మూవీ 'రోమాంచకం'. వేణు గోపాల్ రెడ్డి రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరించారు. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ మూవీపై అనౌన్స్‌మెంట్ నుంచే యూత్‌లో ఆసక్తి ఏర్పడింది. ఇప్పటికే ప్రీమియర్స్ తర్వాత సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వస్తుండగా.. సూపర్ స్టార్ మహేశ్ బాబు చేసిన ఓ పోస్టు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'రోమాంచకం' చూసిన అనంతరం మహేశ్ బాబు తన సోషల్ మీడియా ఖాతాలో స్పందించారు. సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా, ప్రామిసింగ్‌గా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా సహా మూవీ టీం మొత్తానికి మహేశ్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737